# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నంచడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 10 సంచిక : 36 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ శనివారం 10 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME 10 ISSUE :36 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SAT 10 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## తమిళనాడులో టీవీకే ప్రభంజనం..
### రెండు స్థానాలను గెలుచుకున్న విజయ్ పార్టీ



పెన్ పవర్ డెస్క్:తమిళనాడులో అధికార టీవీకే పార్టీ ప్రభంజన సృష్టించింది. సీఎం విజయ్ పాలనకు రెఫరెండంగా భావించిన ఉపఎన్నికల్లో ధారాపురం, మధురాం తకం స్థానాలను గెలుచుకుంది.

- మిగతా 2లో

## అర్ధరాత్రి బర్త్‌డే వేడుకలా? జాగ్రత్త.. సజ్జనార్ హెచ్చరిక!



పెన్ పవర్ డెస్క్:అర్ధరాత్రి వేళ రోడ్లపై పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ నగరవాసులకు విజ్ఞప్తి చేశారు. ట్యాంక్‌బండ్‌తో పాటు నగరంలోని

- మిగతా 2లో



## రైతులు పంట గురించి ఆలోచించాలే తప్ప ఆందోళన చెందకూడదు

- ప్రకాశం జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు
- 'మీ భూమి-మీ హక్కు' కింద రాజముద్రతో కొత్త పాస్‌బుక్‌ల పంపిణీ
- రూ.166 కోట్లతో పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్‌కు శంకుస్థాపన
- అధికారుల పనితీరుపై బహిరంగంగా సమీక్ష.. పనితీరు మెరుగుపరుచుకోవాలని ఆదేశం
- బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించిన ముఖ్యమంత్రి

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా పాలన సాగిస్తామని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం నర్సింగోలులో శుక్రవారం ఆయన పర్యటించి, 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు.

- మిగతా 2లో





# ఏపీలో స్థానిక ఎన్నికలకు లైన్ క్లియర్

## వైసీపీ పిటిషన్ కొట్టివేత

- ఏపీలో స్థానిక ఎన్నికల నిర్వహణకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్
- వైసీపీ దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేత
- ఎస్ఐఆర్ పూర్తయ్యే వరకు వేచి ఉండాలన్న వాదనకు అంగీకరించని కోర్టు
- పాత లేదా తాజా ఓటర్ల జాబితాతో ఎన్నికలు నిర్వహించుకోవచ్చని స్పష్టీకరణ
- వార్డుల పునర్విభజనతో ఎన్నికలు ఆలస్యం చేయొద్దని వ్యాఖ్య

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. ఎన్నికలను వాయిదా వేయాలని కోరుతూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఓటర్ల జాబితా, వార్డుల పునర్విభజన అంశాలపై కీలక స్పష్టత ఇచ్చింది. దీంతో రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై ఉత్కంఠకు తెరపడినట్లయింది.ఓటర్ల జాబితాపై విచారణ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికలు నిర్వహించకూడదన్న వైసీపీ వాదనను ధర్మాసనం అంగీకరించలేదు. ఎస్ఐఆర్ తాజా జాబితా సిద్ధమైనా, పాత ఓటర్ల జాబితాతోనైనా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని స్పష్టం చేసినట్లు సమాచారం.వార్డుల పునర్విభజన అంశంపైనా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పటికిప్పుడు వార్డుల పునర్విభజన చేపట్టాలని కోరడం ఎన్నికలను ఆలస్యం చేసే ప్రయత్నమేనన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. దీంతో ఎన్నికల నిర్వహణకు సంబంధించి అడ్డంకులు తొలగినట్లయింది.

- మిగతా 2లో








## ఢిల్లీలో 24గంటలు ఇంటర్నెట్ బంద్

పెన్ పవర్ డెస్క్:సర్ ప్రక్రియలో అక్రమాలతో ఓట్ చోరీ చేశారని, చీఫ్ ఎలక్షన్ కమిషర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసన క్రమంలో సెంట్రల్ ఢిల్లీలో హైఅలర్ట్ ప్రకటించారు పోలీసులు. (శుక్రవారం) రాత్రం 10 నుంచి సెంట్రల్ ఢిల్లీ వ్యాప్తంగా మెట్రో స్టేషన్ల మూసివేతతోపాటు

- మిగతా 2లో

## యువతను ఎవరూ ఆపలేరు
### ఢిల్లీ ఆంక్షలపై కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ కీలక వ్యాఖ్యలు



- భారత యువతను ఎవరూ అడ్డుకోలేరన్న కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్
- ఢిల్లీలో సీజేపీ నిరసన నేపథ్యంలో రైళ్లు, మెట్రోలపై కఠిన ఆంక్షలు
- రాజధానిలో 23,000 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- మెట్రో సేవలను పూర్తిగా నిలిపివేయవద్దని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశం

- మిగతా 2లో



## విజయవాడకు విచ్చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- దసరా ఉత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రికి రానున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- అక్టోబర్ 16న అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు
- పది రోజుల పాటు రూ.100, రూ.300, రూ.500 దర్శన టికెట్లు రద్దు

పెన్ పవర్ డెస్క్:విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరగనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొననున్నారు. అక్టోబర్ 14వ తేదీన ఆమె దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయను న్నారు. ఈ నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు పది రోజుల

- మిగతా 2లో



## మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన యువ చెస్ కెరటం చల్లా నిహారిక

- మంత్రి లోకేశ్‌తో యువ చెస్ క్రీడాకారిణి నిహారిక భేటీ
- ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ టైటిల్ సాధించినందుకు అభినందనలు
- ఉమెన్ గ్రాండ్‌మాస్టర్ కావడమే తన లక్ష్యమని వెల్లడించిన నిహారిక
- ప్రభుత్వపరంగా పూర్తి సహకారం అందిస్తామని లోకేశ్ హామీ

- మిగతా 2లో

## ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారు



పెన్ పవర్ డెస్క్: ఎస్ఐఆర్‌కు సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ పెద్ద తప్పు చేశారని ఇండీ కూటమి నేతలు ఆరోపించారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా, సీఈసీ ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రపతితో

- మిగతా 2లో

## దక్కని నోబెల్ 'శాంతి'.. ట్రంప్ ఏమన్నారంటే!



పెన్ పవర్ డెస్క్:నోబెల్ శాంతి బహుమతి పొందేందుకు తాను అర్హుడనని.. అది తనకు వస్తుందనే నమ్మకం మాత్రం తక్కువేనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికాకు చెందిన నవనీతమ్ పిళ్లైకు

- మిగతా 2లో



## జనసేన ఎమ్మెల్యే బాలరాజుపై పవన్ కల్యాణ్ సీరియస్..
### విచారణకు కమిటీ

- పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై విచారణకు కమిటీ
- జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు జారీ
- బాలరాజు వ్యవహారశైలిపై తీవ్ర అసంతృప్తితో ఉన్న పవన్
- గతంలో హెచ్చరించినా తీరు మారకపోవడంతో ఆగ్రహం
- కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని ప్రకటన

- మిగతా 2లో




## ఎల్‌నినో అతి తీవ్రం కాబోతోందా? బలమైన ఎల్ నినో ఇదేనట

ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న ఎల్‌నినో వేగంగా బలపడుతోంది. దీనివల్ల చాలా ప్రాంతాల్లో సాధారణం కన్నా అధిక ఉష్ణోగ్రతలు నమోదుకానున్నాయి. ఈ మేరకు ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. డిసెంబరులో ఎల్‌నినో గరిష్ఠ స్థాయికి చేరుకోనుందని తెలిపింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకూ ఈ వాతావరణం ఇలాగే కొనసాగడానికి 100 శాతం అవకాశాలు ఉన్నాయని వివరించింది. దీంతో 1950 తర్వాత అత్యంత బలమైన ఎల్‌నినోగా ఇది నిలిచిపోయే అవకాశం ఉందని వివరించింది.

**కాంక్రీట్ జంగిల్ గా ...**

కాంక్రీట్ జంగిల్ గా మారుతున్న ప్రపంచంతో పాటు, అడవుల నరికివేతతో వాతావరణ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అందుకే గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఇది తీవ్రం చేస్తుందని తెలిపింది. అక్టోబరు నుంచి డిసెంబరు మధ్య కాలంలో.. ఎల్‌నినోకు కేంద్ర బిందువుగా ఉన్న మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో.. సాధారణం కన్నా 3.7 డిగ్రీల సెల్సియస్ మేర పెరగొచ్చని పేర్కొంది.

**వేడి తీవ్రత ఎక్కువయి...**

ఈ పరిణామాలపై ప్రపంచవ్యాప్తంగా వాతావరణ నిపుణులు కూడా ఆందోళన వ్యక్తంచేశారు. నానాటికీ తీవ్రమవుతున్న ఎల్‌నినో వల్ల పసిఫిక్ మహా సముద్రంలో నిక్షిప్తమైన ఉష్ణం బయటకు విడుదలవుతుందని తెలిపారు. దీనివల్ల భూమి పై చాలా భాగం తీవ్ర ఉష్ణోగ్రతలతో అల్లాడుతుందని పేర్కొన్నారు. శీతాకాలంలో గరిష్ఠ శక్తిని సంతరించుకునే దిశగా ఎల్‌నినో సాగుతుందని ని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. .ఎల్‌నినో వల్ల జూన్–సెప్టెంబరు మధ్య భారత్‌లో దీర్ఘకాల సరాసరి వర్షపాతంతో పోలిస్తే 87.4 శాతం మేర మాత్రమే వానలు పడ్డాయి. ఈ ప్రభావంతో దేశంలో పర్యావరణంపై ప్రభావం పడుతుంది. కరవు, అసాధారణ వేడి పరిస్థితులకు ఆస్కారం పెరుగుతుందన్న ఆందోళన వ్యక్తమవుతుంది.

## ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారు

- మొదటి పేజి తరువాయి

భేటీ అనంతరం ఇండీ కూటమి నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, మమతా బెనర్జీ, ప్రియాంకగాంధీ తదితరులు మీడియాతో మాట్లాడారు. “ఓటు చోరీకి సంబంధించి రాష్ట్రపతికి వివరించాం. ఓట్ల చోరీ ఎక్కడెక్కడ జరిగిందో రాష్ట్రపతి ఆధారాలు అడిగారు. వాటిని అందజేశాం. బ్యాలెట్ పత్రాల ద్వారానే ఎన్నికలు జరపాలని కోరాం. ఓట్ల చోరీ జరుగుతోందని దేశం మొత్తానికి తెలుసు. సీఈసీ కార్యాలయం నుంచే అన్ని చోరీలు జరుగుతున్నాయి.” అని రాహుల్ గాంధీ

## విజయవాడకు విచ్చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- మొదటి పేజి తరువాయి

పాటు ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి.రాష్ట్రపతితో పాటు, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అమ్మవారిని దర్శించుకోనున్నారు. అక్టోబర్ 16న మూలా నక్షత్రం రోజున ఆయన రాష్ట్ర ప్రభుత్వం తరపున కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ ఉత్సవాలకు సుమారు 20 లక్షల నుంచి 25 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ దర్శన టికెట్ల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఉత్సవాలు జరిగే పది రోజుల పాటు రూ.100, రూ.300, రూ.500 ధర గల దర్శన టికెట్లను పూర్తిగా రద్దు చేసింది. కేవలం ఉచిత దర్శనంతో పాటు, త్వరితగతిన దర్శనం కోరుకునే వారి కోసం రూ.1000 ప్రత్యేక శీఘ్రదర్శనం టికెట్‌ను మాత్రమే అందుబాటులో ఉంచింది. ఈ టికెట్లను ‘మన మిత్ర’ వాట్సాప్ సేవ ద్వారా పొందవచ్చని అధికారులు తెలిపారు.సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఉదయం 6 నుంచి 8 గంటల వరకు మాత్రమే ప్రోటోకాల్, వీఐపీ దర్శనాలకు సమయం కేటాయించినట్లు ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్ తెలిపారు. రద్దీని బట్టి సాయంత్రం వేళ కూడా వీఐపీ దర్శనాలకు మరో స్లాట్ కేటాయించే అవకాశం ఉందని వివరించారు. భక్తుల కోసం భారీ క్యూ కాంప్లెక్స్‌లు, ఇతర మౌలిక సదుపాయాలను సిద్ధం చేశారు.

# రైతులు పంట గురించి ఆలోచించాలే తప్ప ఆందోళన చెందకూడదు

- మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రైతు పొలంలో పంట గురించి ఆలోచించాలి గానీ, తన భూమి భద్రతపై ఆందోళన చెందకూడదన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

**భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం**

గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల విషయంలో జరిగిన అవకతవకలను సరిదిద్ది, రైతులకు పూర్తి భద్రత కల్పిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. “మీ భూమి మీదే, హక్కు మీదే, ఆ హక్కును కాపాడే బాధ్యత మాది. అందుకే పాత పాస్‌బుక్‌లపై నాయకుల బొమ్మలు తొలగించి, ప్రభుత్వ రాజముద్రతో గ్యారెంటీ ఇస్తున్నాం” అని అన్నారు. వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశామని, రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టిన 22ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామని వివరించారు.

రాష్ట్రవ్యాప్తంగా 16.48 లక్షల ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించామని, ప్రకాశం జిల్లాలోనే 3,304 ఎకరాల భూ సమస్యలను పరిష్కరించి 7,980 కుటుంబాల ఆశలను నిజం చేశామని తెలిపారు. గర్భకండ్రిగ వంటి ఏళ్లనాటి భూములకు సైతం విముక్తి కల్పించామన్నారు. భూ రికార్డులన్నీ డిజిటలైజ్ చేసి, బ్లాక్‌చైన్ టెక్నాలజీతో భద్రపరిచామని, రైతులు తమ ఇంటి నుంచే తమ భూమి వివరాలను ఫోన్‌లో చూసుకోవచ్చని చెప్పారు. ప్రతి నెలా 9వ తేదీన ఈ కార్యక్రమ పురోగతిని తానే స్వయంగా సమీక్షిస్తానని, అవినీతికి ఆస్కారం లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

**ప్రాజెక్టులకు శంకుస్థాపన.. అభివృద్ధికి బాటలు**

ఈ పర్యటనలో భాగంగా, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్ నిర్మాణానికి, పాలేరు నదిపై హైలెవల్ వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 9,500 ఎకరాలకు సాగునీరు, 15 గ్రామాల్లోని 30,000 మందికి తాగునీరు అందుతుందని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్–1ను నీళ్లు విడుదల చేశాకే జాతికి అంకితం చేశామని, ఫేజ్–2ను కూడా పూర్తి చేసి ఏటా నీళ్లిచ్చే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాబోయే మూడేళ్లలో రూ.36 వేల కోట్లతో 35 ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. రామాయపట్నం పోర్టును వేగంగా పూర్తి చేస్తున్నామని, బీపీసీఎల్ రూ.50 వేల కోట్ల పెట్టుబడితో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయని అన్నారు. దొనకొండను కీలక పారిశ్రామిక టౌన్‌షిప్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు.

**వేదికపైనే ‘పబ్లిక్ ఆడిట్’.. అధికారులకు చురకలు**

ఈ సభలో అందరి దృష్టినీ ఆకర్షించిన ప్రధాన ఘట్టం.. చంద్రబాబు వేదికపైనే నిర్వహించిన ‘పబ్లిక్ ఆడిట్’. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను వేదికపైకి పిలిచి, ప్రజా స్పందన ఆధారంగా రూపొందించిన పనితీరు గణాంకాలను (పెర్ఫార్మెన్స్ డేటా) చదివి వినిపించారు. రాష్ట్ర సగటుతో పోలిస్తే ప్రకాశం జిల్లా, కొండేపి నియోజకవర్గం ఏయే అంశాల్లో వెనుకబడి ఉందో అంకెలతో సహా వివరించారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా (–7.93%), రవాణా శాఖ పన్నులు (–7.32%), రీ–సర్వే (–7.53%), అంగన్‌వాడీ సేవలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంటి అంశాల్లో ప్రతికూల పనితీరుపై అధికారులను నేరుగా ప్రశ్నించారు. “మీరు సరిగా పనిచేయకపోతే ప్రజలు నన్ను నిందిస్తారు. మీవల్ల నేను మాట పడాలా? పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవు” అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. అదే సమయంలో గృహ నిర్మాణం (హౌసింగ్), ఇసుక సరఫరా, మత్స్యకార భరోసా వంటి అంశాల్లో మెరుగైన పనితీరు కనబరిచిన అధికారులను అభినందించారు.

నాలుక చెప్పిందని కాకుండా, మంచి ఆహారం తీసుకోవాలి

రాష్ట్ర ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చంద్రబాబు తెలిపారు. ఆరోగ్యమే అసలైన సంపద అని, తాను రోజూ మూడు కోడిగుడ్లలోని తెల్లసొనతో చేసిన ఆమ్లెట్ తింటానని, అదే తన ఆరోగ్య రహస్యమని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ వంటగదినే ఔషధశాలగా మార్చుకోవాలని, నాలుక చెప్పిందని కాకుండా శరీరానికి ఏది మంచిదో అదే తినాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేసి, సరైన సమయంలో మందులు వేసుకునేలా గుర్తుచేసే వ్యవస్థను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

**సంక్షేమం, రాజకీయ అంశాలపై వ్యాఖ్యలు**

ఎన్డీఏ ప్రభుత్వం డబుల్ ఇంజన్ సర్కార్ వేగంతో పనిచేస్తోందని, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచి ట్రిబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రాన్ని మరింత వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలైన పెన్షన్ల పెంపు, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏటా మూడు ఉచిత సిలిండర్లు, అన్నదాత సుఖీభవ వంటివి విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావిస్తూ, తాము 34 శాతానికి పెంచితే, ప్రత్యర్థులు కోర్టులకు వెళ్లి అడ్డుకున్నారని ఆరోపించారు. కోర్టు తీర్పు ఎలా ఉన్నా, పార్టీపరంగా 34 శాతం కంటే ఎక్కువ సీట్లు బీసీలకు ఇచ్చి వారి రాజకీయ ఎదుగుదలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

**నేను నీతిమంతుడిగా ఉంటే సరిపోదు**

నీతివంతమైన రాజకీయాలు చేయడమే తన లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. “నేను నీతివంతుడిగా ఉంటే సరిపోదు, నా కింద పనిచేసే అధికార యంత్రాంగం, రాజకీయ నాయకులు కూడా అవినీతికి దూరంగా ఉండాలి. చిత్రగుప్తుడిలా అందరి ఖాతాలను రాసుకుంటున్నాను. ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎవరినైనా ఉపేక్షించేది లేదు. పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగితే ఎవరికీ తెలియదనుకోవడం భ్రమ. నేను 360 డిగ్రీల కోణంలో అందరినీ గమనిస్తున్నాను” అని హెచ్చరించారు. ప్రజాసేవకుడిగా ప్రజల బాగోగులే తనకు ముఖ్యమని, దేశభక్తిని, రాష్ట్రంపై అభిమానాన్ని పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించాలని కోరారు. అంతిమంగా, ఆర్థిక అసమానతలు లేని సమాజాన్ని నిర్మించడమే తన ఆశయమని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

## జనసేన ఎమ్మెల్యే బాలరాజుపై పవన్ కల్యాణ్ సీరియస్..

జనసేన పార్టీకి చెందిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై వస్తున్న ఆరోపణల వ్యవహారంపై డిప్యూటీ సీఎం, పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. బాలరాజుపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపేందుకు పవన్ కల్యాణ్ ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమిస్తున్నట్లు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ నిర్ణయం పార్టీలో అంతర్గతంగా కలకలం రేపుతోంది.గత కొంత కాలంగా ఎమ్మెల్యే బాలరాజు వ్యవహారశైలి, పనితీరుపై పవన్ కల్యాణ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల మీడియాలో ఆయనపై ఆరోపణలు రావడంతో ఈ వ్యవహారాన్ని అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. గతంలోనే బాలరాజును పార్టీ కార్యాలయానికి పిలిపించి, గిరిజన ప్రజలకు పారదర్శకమైన, నీతివంతమైన పాలన అందించాలని, వారి సేవకే అంకితం కావాలని పవన్ కల్యాణ్ వ్యక్తిగతంగా సూచించారు. అయినప్పటికీ ఆయన ప్రవర్తనలో మార్పు రాకపోవడంపై పవన్ తీవ్ర అసహనం, విసుగుతో ఉన్నట్లు పార్టీ ప్రకటనలో పేర్కొన్నారు.ఓవైపు ‘అడవితల్లి బాట’ వంటి కార్యక్రమాల ద్వారా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పార్టీ కృషి చేస్తుంటే, అదే గిరిజన ప్రాంతం నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధి వ్యవహారశైలిపై వస్తున్న ఆరోపణలు పార్టీకి ఇబ్బందికరంగా మారాయి. ఈ నేపథ్యంలోనే పవన్ కల్యాణ్ ఈ విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది.ఈ కమిటీ క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, వాస్తవాలను నిగ్గు తేల్చి, పార్టీ అధ్యక్షుడికి నివేదిక సమర్పించనుంది. ఆ నివేదిక ఆధారంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై తదుపరి చర్యలు ఉంటాయని జనసేన పార్టీ స్పష్టం చేసింది. దీంతో బాలరాజు రాజకీయ భవిష్యత్తుపై ఉత్కంఠ నెలకొంది.

## మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన యువ చెస్ కెరటం చల్లా నిహారిక

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువ చెస్ క్రీడాకారిణి, ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ చల్లా నిహారిక రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. శుక్రవారం ఉండవల్లిలోని మంత్రి నివాసంలో ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి లోకేశ్‌తో భేటీ అయింది. ఇటీవలే ప్రతిష్ఠాత్మక ఫిడే ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ హోదాను సాధించిన నిహారికను ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.ఈ భేటీలో నిహారిక సాధించిన విజయాలను మంత్రి లోకేశ్ ప్రశంసించారు. చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తూ రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తున్నారని కొనియాడారు. నిహారిక ప్రతిభ, పట్టుదల భవిష్యత్తులో ఎందరో యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా తన భవిష్యత్ లక్ష్యాలను నిహారిక మంత్రికి వివరించింది. ఉమెన్ గ్రాండ్‌మాస్టర్ టైటిల్ సాధించడమే తన తదుపరి లక్ష్యమని ఆమె స్పష్టం చేసింది. ఆమె ఆకాంక్షలను విన్న మంత్రి లోకేశ్, లక్ష్యసాధనలో ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. శిక్షణ, అంతర్జాతీయ టోర్నమెంట్లలో పాల్గొనడానికి అవసరమైన పూర్తి సహకారాన్ని అందిస్తామని భరోసా కల్పించారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించడమే తమ ప్రభుత్వ విధానమని ఆయన పునరుద్ఘాటించారు.

## అర్ధరాత్రి బర్త్‌డే వేడుకలా? జాగ్రత్త.. సజ్జనార్ హెచ్చరిక!

- మొదటి పేజి తరువాయి

ప్రధాన రహదారులు, చెరువులు, పార్కుల వద్ద అర్ధరాత్రి కేక్ కటింగ్‌లు చేయొద్దని స్పష్టం చేశారు. సరదా కోసం చేసే చిన్నపాటి నిర్లక్ష్యం కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.మూడు రోజుల క్రితం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ట్యాంక్‌బండ్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరేళ్ల చిన్నారి, ఆమె బంధువు ప్రాణాలు కోల్పోయారు. చిన్నారి పుట్టినరోజు వేడుకల సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని సజ్జనార్ తెలిపారు.ఈ ఘటన నేపథ్యంలో ట్యాంక్‌బండ్‌లో ప్రమాదాలు జరిగే ప్రాంతాన్ని ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించినట్లు చెప్పారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టామని, సంబంధిత ప్రభుత్వ శాఖలతోనూ సమీక్ష నిర్వహించామని వెల్లడించారు.అర్ధరాత్రి వేళ రోడ్లపై పాదచారుల రాకపోకలు తక్కువగా ఉండటంతో వాహనాలు వేగంగా వెళుతుంటాయని సజ్జనార్ హెచ్చరించారు. అలాంటి సమయంలో చిన్నపిల్లలను వెంటబెట్టుకుని రోడ్ల మధ్యకు రావడం ప్రమాదకరమన్నారు. పుట్టినరోజు వేడుకలు కుటుంబ సభ్యుల మధ్య ఇంట్లో లేదా సురక్షితమైన ప్రదేశాల్లో నిర్వహించుకోవాలని సూచించారు.ట్యాంక్‌బండ్‌పై వేడుకలు నిర్వహించడంపై ఇప్పటికే జీహెచ్‌ఎంసీ నిషేధాజ్ఞలు ఉన్నాయని గుర్తుచేశారు. పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహిస్తూ, వేడుకల కోసం అక్కడికి వచ్చే వారిని వెనక్కి పంపిస్తున్నా, మళ్లీ అర్ధరాత్రి వేడుకలకు వస్తుండటంతో ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని పేర్కొన్నారు. క్షణకాలపు ఆనందం కోసం విలువైన ప్రాణాలను కోల్పోవద్దని, ఇకపై ట్యాంక్‌బండ్, చెరువులు, బహిరంగ ప్రదేశాల్లో అర్ధరాత్రి వేడుకలు నిర్వహించవద్దని నగరవాసులకు విజ్ఞప్తి చేశారు.

## ఢిల్లీలో 24గంటలు ఇంటర్నెట్ బంద్

- మొదటి పేజి తరువాయి

ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

అక్టోబర్ 10న సీజేపీ, విద్యార్థి సంఘాల నిరసనలకు అనుమతి లేదని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. గతంలో జరిగిన నిరసనల్లో రూల్స్ ఉల్లంఘించినందుకు తాజా నిరసనలకు అనుమతి నిరాకరించారు.ముందస్తు చర్యల్లో భాగంగా మెట్రో స్టేషన్ల మూసివేత, ఇంటర్నెట్ సేవల నిలిపివేత, భారీ బందోబస్తు చేపట్టినట్లు తెలిపారు.

మరోవైపు ఢిల్లీలోని 57 మెట్రోస్టేషన్లను మూసివేస్న?నట్లు ఐవీ=జ ప్రకటించింది. పోలీసుల ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రినుంచే సెంట్రల్ ఢిల్లీలోని మెట్రో స్టేషన్లలో రాకపోకలను

నిలిపివేస్తున్నట్లు తెలిపింది. న్యూఢిల్లీ జిల్లాలోని జంతర్ మంతర్ తో పాటు ఇతర కీలక ప్రాంతాల్లో నిరసనల్లో పాల్గొనేందుకు నిరసనల కారులు భారీ ఎత్తున తరలివచ్చే అవకాశం ఉందని గుర్తించిన మెట్రో స్టేషన్లలో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఢిల్లీ పోలీసులు DMRC ని కోరారు.

## యువతను ఎవరూ ఆపలేరు

రైళ్లను రద్దు చేయడం ద్వారానో, రవాణా మార్గాలను నిలిపివేయడం ద్వారానో దేశ యువతను ఎవరూ ఆపలేరని కేంద్ర మంత్రి, లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధినేత చిరాగ్ పాశ్వాన్ అన్నారు. ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) శనివారం తలపెట్టిన నిరసన కార్యక్రమం నేపథ్యంలో రైళ్లు, మెట్రోలపై విధించిన ఆంక్షలపై ఆయన ఈ విధంగా స్పందించారు. శుక్రవారం కుండ్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ (నిఫ్టెమ్) ఏడో స్నాతకోత్సవంలో పాల్గొన్న అనంతరం చిరాగ్ పాశ్వాన్ విలేకరులతో మాట్లాడారు. “వీరు భారత యువత, వీరిని ఎవరూ ఆపలేరు. ఎన్ని రైళ్లను ఆపగలరు? రవాణా సౌకర్యాలను ఎంతవరకు నిలిపివేయగలరు? ఎన్ని రోడ్లను దిగ్బంధించగలరు? ప్రపంచానికే దిశానిర్దేశం చేసే సత్తా భారత యువతకు ఉంది. అటువంటి పరిస్థితుల్లో వారిని ఎవరూ అడ్డుకోలేరు” అని ఆయన వ్యాఖ్యానించారు.సీజేపీ నిరసన కారణంగా న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లకు శనివారం ఉదయం 4 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య రావాల్సిన, వెళ్లాల్సిన పలు రైళ్లను భారతీయ రైల్వే రద్దు చేయడంతో పాటు మరికొన్నింటి షెడ్యూళ్లను మార్చింది. ఈ నిరసన నేపథ్యంలో రాజధానిలో 23,000 మందికి పైగా భద్రతా సిబ్బందిని మోహరించి నగరాన్ని ఒక ఇనుప కోటలా మార్చేశారు.గతంలో నిర్వహించిన నిరసనల సందర్భంగా నిర్వాహకులు చట్టపరమైన ఆదేశాలను పాటించడంలో విఫలమయ్యారని పేర్కొంటూ, ఢిల్లీ పోలీసులు ఈసారి నిరసనకు అనుమతి నిరాకరించారు. అంతేకాకుండా, 57 మెట్రో స్టేషన్లను మూసివేయాలని ప్రతిపాదించారు. పోలీసుల ప్రతిపాదన మేరకు, శుక్రవారం రాత్రి 9 గంటల నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఈ స్టేషన్లలో ప్రవేశ, నిష్క్రమణలను నిలిపివేస్తున్నట్లు ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్సీ) తొలుత ప్రకటించింది.అయితే, ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంది. శనివారం నాటి నిరసనను దృష్టిలో ఉంచుకుని మెట్రో రైలు సేవలను పూర్తిగా నిలిపివేయరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రజలకు అసౌకర్యం కలగకుండా, అవసరమైన నియంత్రణలతో మెట్రో, ఇతర రైల్వే సేవలు కొనసాగేలా చూడాలని కేంద్రాన్ని ఆదేశించింది.

## దక్కని నోబెల్ ‘శాంతి’.. ట్రంప్ ఏమన్నారంటే!

- మొదటి పేజి తరువాయి

ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు రావడంపై ట్రంప్ పరోక్షంగా స్పందించారు. ఆయనకు మద్దతుగా ఓ సీనియర్ న్యాయవాది ట్రూత్ సోషల్‌లో పెట్టిన పోస్టును రీపోస్టు చేసిన ఆయన.. నోబెల్ శాంతి దక్కకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.“అమెరికా, ఇజ్రాయెల్‌ను బహిరంగంగా ద్వేషించే వ్యక్తి నవనీతమ్ పిళ్లై. శాంతిని పెంపొందించడానికి ఆమె ఎన్నడూ ప్రయత్నించలేదు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడానికి.. ఇరాన్‌ను అడ్డుకోవడానికి ట్రంప్ శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. గాజాను పునర్నిర్మించడానికి కృషి చేస్తున్నారు. అసాధ్యం అనుకున్న అబ్రహం ఒప్పందాన్ని అందించారు. ఇప్పుడు దాన్ని విస్తరిస్తున్నారు. నోబెల్ శాంతి బహుమతికి ఇలాంటి విషయాలను గుర్తించాల్సింది” అని అమెరికాకు చెందిన సీనియర్ అటార్నీ డేవిడ్ షోయెన్ పెట్టిన పోస్టుపై ట్రంప్ స్పందించారు.

## తమిళనాడులో టీవీకే ప్రభంజనం..

### రెండు స్థానాలను గెలుచుకున్న విజయ్ పార్టీ

- మొదటి పేజి తరువాయి

2026 అక్టోబర్ 9న జరిగిన కౌంటింగ్ లో ముందునుంచీ టీవీకే అభ్యర్థులు లీడ్ లో కొనసాగుతూ చివరికి విజయం సాధించారు. ధారాపురం నియోజకర్గంలో టీవీకే అభ్యర్థి సత్యభామ గెలుపొందారు. మొత్తం 23 రౌండ్ల కౌంటింగ్ తర్వాత సత్యభామ 9 వేల 471 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆమెకు మొత్తం 66 వేల 841 ఓట్లు వచ్చాయి. అంటే 37.02 శాతం ఓట్లతో గెలుపొందారు. ఇక డీఎంకే 57 వేల 370 ( 31.78%) ఓట్లతో రెండో స్థానంలో నిలవగా.. అన్నాడీఎంకే 45 వేల 280 ( 25.08%) ఓట్లు సాధించింది. ధారాపురంలో జనరల్ ఎలక్షన్లలో 40 వేల ఓట్లతో ఓడిన టీవీకే.. ఇప్పుడు దాదాపు పదివేల ఓట్ల తేడాతో గెలుపొందటం గమనార్హం. ఇక మధురాంతకంలో 19 వేల 241 ఓట్లతో టీవీకే అభ్యర్థి మరగతం కుమారవేల్ విజయాన్ని అందుకున్నారు. దీంతో పార్టీ కార్యకర్తలు స్వీట్లు పంచుతూ పార్టీ విజయాన్ని సెలబ్రేట్ చేసుకున్నారు.ఇక తమ పాలనకు రెఫరెండంగా భావించి ఉపఎన్నికలకు వెళ్లిన టీవీకే.. తమ పాలనపై ప్రజలకు విశ్వాసం ఉందని.. ప్రజలు సంతృప్తిగా ఉన్నారని భావిస్తోంది. పార్టీ గెలుపుతో కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు.

# జర్నలిస్టు రమేష్ కు ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ.మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు,పరామర్శ.

?**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, అక్టోబర్, 09:**ప్రత్తిపాడు మండలం ?ప్రజాశక్తి విలేఖరి సిగిరెడ్డి రమేష్‌పై ఇటీవల జరిగిన దాడిని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు తీవ్రంగా ఖండించారు. విలేఖరి సిగిరెడ్డి రమేష్‌ను వేర్వేరు గా పరామర్శించి, ఆయనకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడి, నీతి నిజాయితీతో వార్తలు రాసే జర్నలిస్టులపై ఇటువంటి దాడులు జరగడం దురదృష్టకరమన్నారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించేలా ప్రవర్తించే వారిని ఉపేక్షించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు.

?ఈ కార్యక్రమంలో చక్కపల్లి బూరయ్య , గంటా చంటిబాబు, కోలా ధనబాబు, నేదుల్ల జోగేశ్వరరావు, స్థానిక నాయకులు పలువురు



మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పెన్ పవర్

కాకినాడ

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

## మురారిలో వైఎస్సార్‌సీపీ ఐడీ కార్డుల పంపిణీ

### స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి: తోట నరసింహం



**గండేపల్లి, పెన్ పవర్,అక్టోబర్ 09:**కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గం గండేపల్లి మండలం మురారి గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గద్దె వీరన్న చౌదరి ఆధ్వర్యంలో పార్టీ ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యుడు తోట నరసింహం ఈ కార్యక్రమానికి హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో సిద్ధం కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గండేపల్లి ఎంపీపీ చలగల దొరబాబు, కాకినాడ జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు రామకుర్తి రామచంద్రమూర్తి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ విభాగం ప్రధాన కార్యదర్శి ఒబిని వీరబాబు, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం ప్రధాన కార్యదర్శి తాళ్లూరు మధుకుమార్, గండేపల్లి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ చౌదరి, జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు పోకల సుబ్బారావు (సుబ్బు), కాకినాడ జిల్లా వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి గొల్లవిల్లి రామకృష్ణ, మురారి గ్రామ ఎంపీటీసీ రాణి తదితర గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.




## డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి.. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

### ఆదిత్య యూనివర్సిటీలో 'ఆపరేషన్ త్రిశూల్' అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బిందుమాధవ్





**గండేపల్లి, పెన్ పవర్, (సూరంపాలెం) అక్టోబర్ 09:**యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, ఐపీఎస్ సూచించారు. సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో నిర్వహించిన 'ఆపరేషన్ త్రిశూల్' అవగాహన కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొని విద్యార్థులకు పలు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని హెచ్చరించారు. డ్రగ్స్ నిర్మూలన కోసం చేపట్టిన 'రైజ్ ఎగైనెస్ట్ గాంజా' కార్యక్రమంలో విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం అందించే వారికి తగిన బహుమతి ఇస్తామని, అలాంటి సమాచారాన్ని 1972 హెల్ప్‌లైన్ నంబర్‌కు తెలియజేయాలని సూచించారు.

**రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత**

రహదారి ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు సీటుబెల్టు ధరించాలని సూచించారు. అతివేగం, వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ వినియోగించడం వంటి నిర్లక్ష్యపు చర్యలకు దూరంగా ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టపరంగా తీవ్రమైన నేరమని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రజల ప్రాణాల రక్షణ కోసమేనని వివరించారు.

**సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి**

డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. అపరిచిత లింకులు, ఆన్‌లైన్ పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో వచ్చే ప్రలోభాలు, నకిలీ పెట్టుబడి పథకాలను నమ్మవద్దన్నారు. బ్యాంకు ఖాతా వివరాలు, పిన్, ఓటీపీ వంటి రహస్య సమాచారాన్ని ఇతరులకు వెల్లడించకూడదని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు. అనధికారిక రుణ యాప్‌ల ఉచ్చులో చిక్కుకోవద్దని హెచ్చరించారు.

**మహిళల భద్రతకు ప్రాధాన్యం**

మహిళలు, బాలికల భద్రతకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఎస్పీ తెలిపారు. వేధింపులకు గురైన వారు భయపడకుండా 112 అత్యవసర నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్'లో భాగంగా విద్యార్థులు నేరాల నివారణలో పోలీసులకు సహకరిస్తూ సురక్షిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ల పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, వారితో సరదాగా మాట్లాడటం, కలిసి క్యాంటీన్‌లో కాఫీ తాగడం వంటి చర్యల ద్వారా వారిలో భయాన్ని తొలగించి, ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామనే నమ్మకాన్ని కల్పించాలని సూచించారు.

**పోలీసు, విశ్వవిద్యాలయ అధికారులు హాజరు**

ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, ఎస్‌బీ డీఎస్పీ కేవీవీ సత్యనారాయణ, పెద్దాపురం డీఎస్పీ ఏబీజీ తిలక్, ఈగల్ ఇన్‌స్పెక్టర్ జి. వెంకటేశ్వరరావు, జగ్గంపేట సీఐ తిరుపతిరావు, గండేపల్లి ఎస్సై యు.వి. శివనాగబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్య యూనివర్సిటీ తరఫున ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎన్. సతీష్ రెడ్డి, డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాస రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ జి. సురేష్, డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ వై.కె.ఎస్. సుబ్బారావు, యాంటీ ర్యాగింగ్ కన్వీనర్ డాక్టర్ ఐ. రమేష్ రాజా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల అమలు తీరుపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం.





**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్, 09:** మండలంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల అమలు తీరుపై ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని ఎంపీడీఓ, బాయిశెట్టి హరికృష్ణ, డిప్యూటీ ఎంపీడీఓ ఎస్.వి. సుబ్బారావు ఆధ్వర్యంలో కిర్లంపూడి మండలం బూరుగుపూడి చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో కిర్లంపూడి మండలం అన్ని గ్రామ పంచాయతీల పిడిఓలు,గ్రీన్ అంబాసిడర్లకు, గ్రీన్ గార్డులకు ఎక్స్‌పోజర్ విజిట్తోపాటు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల షెడ్ నిర్వహణ, వర్మీ కంపోస్ట్ తయారీ, తడి చెత్త,పొడి చెత్త సేకరణ, రైతుల నుండి పేడ సేకరణ చేసి చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలకు తరలించుట,అనంతరం నాడెప్ ప్రిపరేషన్, ఆకుకూరలు పెంచుట, వర్మీ బెడ్ ప్రిపరేషన్,నిర్వహణ శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెసింగ్ చేయడం వర్మీ ప్యాకింగ్ వంటి అంశాలపై ప్రయోగాత్మకంగా ప్రాక్టికల్ శిక్షణ అందించారు.అన్ని గ్రామ పంచాయతీలలో ఘన వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయడం, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు షెడ్లను సక్రమంగా వినియోగించడం, డ్రై వేస్ట్ నకు సంబంధించి ప్రతి గ్రామపంచాయతీలో స్వచ్ఛ రథం ద్వారా పొడి చెత్తను తీసుకొని నిత్యవసర వస్తువులు ఇవ్వడం జరుగుతుందన్నారు. పారిశుధ్యాన్ని మెరుగుపరచడంపై అవగాహన కల్పించారు. జిల్లాలో ఉత్తమ అవార్డు గెలుపొందిన బూరుగుపూడి గ్రామంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో పనిచేస్తున్న ధారా పుష్పని ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది.




- స్థానిక ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు సముచిత స్థానం కల్పిస్తాం.
- పెరిక కార్పొరేషన్ చైర్మన్ వనపర్తి భద్రరావు (బద్రి)

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, అక్టోబర్,09:**బీసీల రాజకీయ అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీతో పాటు బీజేపీ, జనసేన పార్టీలు కట్టుబడి ఉన్నాయని రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్మన్ వనపర్తి బద్రి స్పష్టం చేశారు. ప్రత్తిపాడులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై ఇచ్చిన మాట ప్రకారం కూటమి పార్టీలు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పిస్తాయని తెలిపారు. 1987లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు తొలిసారిగా 20 శాతం రిజర్వేషన్లు, 1995లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని బద్రి అన్నారు.బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించడంలో టీడీపీ ఎప్పుడూ ముందుంటుందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కూడా వారి అభ్యున్నతికి కట్టుబడి ఉందని తెలిపారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలను న్యాయస్థానంలో సవాలు చేయడం ద్వారా వైసీపీ నేతలు బీసీలకు తీరని ద్రోహం చేశారని బద్రి ఆరోపించారు.వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ రిజర్వేషన్ల అంశంపై న్యాయపరమైన సమస్యలు తలెత్తినా, సుప్రీంకోర్టును ఆశ్రయించకుండా వదిలేశారని ఆరోపించారు. బీసీలు రాజకీయంగా, సామాజికంగా ఎదగకుండా అడ్డంకులు సృష్టించడమే వైసీపీ వైఖరి అని విమర్శించారు. బీసీలకు న్యాయం చేసేందుకు కూటమి ప్రభుత్వం సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాడిందని, రిజర్వేషన్ల అమలుకు అవసరమైన గణాంకాలను సమర్పించడంతో పాటు బీసీ మంత్రుల బృందం ఢిల్లీలో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులతో చర్చలు జరిపిందని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూనే, బీసీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకునే దిశగా కూటమి పార్టీలు ముందుకు సాగుతాయని స్పష్టం చేశారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూడటం వైసీపీ వైఖరి అయితే, వారికి రాజకీయంగా సముచిత స్థానం కల్పించడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని బద్రి పేర్కొన్నారు. సర్పంచుల నుంచి ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మేయర్లు, జిల్లా పరిషత్ చైర్మన్ల వరకు బీసీలు ఎదిగేందుకు కూటమి పార్టీలు అండగా నిలుస్తాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సింగిలిదేవి సత్తిరాజు, మదినే దొరబాబు, వనపర్తి సతీష్, చిలకమర్తి భద్రం, బొబ్బర ప్రసాద్, యడ్ల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగ్గంపేట అభివృద్ధి

**ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**

**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 9:** జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలో రైతుల చిరకాల కోరిక నెరవేరింది. పల్లె పండుగ 3.0 లో భాగంగా ఇర్రిపాక నుండి కాండ్రేగుల వరకు పొలాల మధ్య నుండి వెళ్లే 5.540 కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి రూ.2.65 కోట్లతో శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ హాజరై శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ, ఇర్రిపాక నుండి కాండ్రేగుల వెళ్లే ఈ రోడ్డు పూర్తిగా పొలాల మధ్య నుండి వెళుతుందని, పూర్తిగా రైతులకు ఉపయోగపడే రోడ్డని స్పష్టం చేశారు. ఈ రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారి



గోతులమయమైందని, దీంతో పంటలను తరలించేందుకు, ట్రాక్టర్లు, పంట కోత యంత్రాలు తీసుకెళ్లేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. రైతుల కష్టాలను గుర్తించి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి వెంటనే 2 కోట్ల 65 లక్షలు మంజూరు చేయించామని, ఈ రోడ్డు పూర్తయితే వందలాది ఎకరాల్లో పంటలు సాగు చేసే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, పంట రవాణా సులభమవుతుందని తెలిపారు. రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అనంతరం ఇర్రిపాక గ్రామంలో 172 మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. లేఔట్ గా విడదీసి అన్ని మౌలిక వసతులతో ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# లోవ తలుపులమ్మ అమ్మవారి నవరాత్రి దీక్ష మాలధారణకు ఏర్పాట్లు పూర్తి

**ఈ నెల 11న మాలధారణ.. 19న దీక్ష విరమణ**




పెన్ పవర్ ప్రతినిధి కాకినాడ జిల్లా (లోవ), **అక్టోబర్ 09:** కాకినాడ జిల్లా తుని మండలం లోవ క్షేత్రంలో కొలువుదీరిన శ్రీ తలుపులమ్మ అమ్మవారి నవరాత్రి దీక్ష మాలధారణ కార్యక్రమానికి ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 11వ తేదీన అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి నవరాత్రి దీక్ష మాలధారణ స్వీకరించనున్నారు. దీక్ష స్వీకరించిన భక్తులు తొమ్మిది రోజులపాటు నియమనిష్ఠలతో దీక్షను ఆచరించి, ఈ నెల 19వ తేదీన లోవ క్షేత్రంలోని అమ్మవారి సన్నిధిలో దీక్ష విరమణ చేయనున్నారు. భక్తులకు దీక్షా విధానంపై అవగాహన కల్పించేందుకు ఆలయ కార్యనిర్వహణాధికారి ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ వేదపండితులు నిర్ధారించిన దీక్ష నియమాలు, పూజా విధానం, దీక్ష మహత్యం, ఫలితాలతో కూడిన సమాచారాన్ని పుస్తక రూపంలో భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

గత ఆషాఢమాసంలో తొలిసారిగా శ్రీ తలుపులమ్మ అమ్మవారి నవరాత్రి దీక్ష మాలధారణ స్వీకరించిన భక్తులు తమ అనుభవాలను పంచుకున్నారు. భక్తుల ఆసక్తి, అనుభవాలను దృష్టిలో ఉంచుకుని రాబోయే కార్తీకమాసంలో మండల దీక్ష, అర్ధమండల దీక్షలను స్వీకరించేందుకు అనువైన తేదీలను ఆలయ వేదపండితులు తెలియజేయనున్నారు. దసరా దేవీ నవరాత్రి ఉత్సవాలకు ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

## జగ్గంపేటలో సూర్య ఘర్ యోజన పథకంపై అవగాహన







**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 9:** జగ్గంపేట పట్టణంలోని గోకవరం రోడ్డులోని పంచాయతీ అతిథి గృహం వద్ద రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో రాయితీతో మీ ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోండి విద్యుత్ బిల్లు తగ్గించుకోండి అనే నినాదంతో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన అవగాహన కార్యక్రమాన్ని విద్యుత్ శాఖ కాకినాడ సూపరిండెంట్ ఇంజనీర్ నల్లం ఉదయ భాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాజరై సోలార్ అవగాహన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యుత్ శాఖ ఉద్యోగులతో కలిసి ర్యాలీలో పాల్గొని సోలార్ విద్యుత్ పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ పథకం ద్వారా ఒక్కసారి సోలార్ ప్యానల్ పెట్టుబడి పెడితే ఇరవై ఏళ్ల వరకు ఉచితంగా విద్యుత్తును వినియోగించుకోవచ్చని, వాడగా మిగిలిన అదనపు విద్యుత్తును విద్యుత్ సంస్థకు విక్రయించడం ద్వారా తిరిగి ఆదాయం కూడా పొందవచ్చని, దీనివల్ల విద్యుత్ బిల్లును పూర్తిగా జీరో చేసుకోవచ్చని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం కింద ఒక కిలో వాట్ కు రూ.30వేలు , రెండు కిలో వాట్లకు రూ. 60వేలు, మూడు కిలో వాట్ల కు రూ.78వేలు వరకు భారీ రాయితీని అందిస్తుందన్నారు. ఒక కిలో వాట్ సామర్థ్యానికి కేవలం వంద చదరపు అడుగుల స్థలం సరిపోతుందని వివరించారు. అలాగే అన్ని ప్రధాన బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకే రుణ సౌకర్యం కల్పిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం ఎస్సీలకు ఉచితంగా బీసీలకు భారీ రాయితీపై సోలార్ ను అందిస్తున్నప్పటికీ నిరుపేదలందరికీ రాయితీతోఈ పథకాన్ని వర్తింపజేసి ప్రతి ఇంటికి సౌరశక్తిని అందించాలని అధికారులను కోరారు. ప్రతి ఒక్కరూ ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఈఈ బి.వీరభద్రరావు, డీఈ కే.మలాకి, జీను మణి బాబు, కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఆరేళ్లుగా సాగుతున్న కథకు ముగింపు ఎప్పుడు?

- సూరంపాలెం భూ వివాదంపై సమగ్ర విచారణ జరిపితేనే అసలు నిజాలు బయటకు!
- 'పెన్ పవర్' ప్రత్యేక పరిశోధన --- ఎపిసోడ్--3
- ఏళ్ల తరబడి నిర్మాణాలు సాగుతున్నా చర్యలెందుకు కనిపించలేదు?
- నోటీసులు ఇచ్చినా అమలు ఎందుకు జరగలేదు?
- ప్రభుత్వ భూముల నుంచి వాణిజ్య ఆదాయం పొందుతున్నారా?
- లబ్ధిదారులు ఎవరు? నష్టపోయింది ఎవరు?
- జిల్లా స్థాయి ప్రత్యేక విచారణ అవసరమా?

సూరంపాలెంలో ప్రభుత్వ భూములు, డి-పట్టాలు, నిర్మాణ అనుమతులు, కమర్షియల్ భవనాల చుట్టూ నెలకొన్న వివాదం ఇటీవల మొదలైనది కాదని స్థానికులు చెబుతున్నారు.

గత ఆరేడు సంవత్సరాలుగా పరిస్థితి క్రమంగా మారిందని, మొదట చిన్నస్థాయిలో ప్రారంభమైన వ్యవహారం తర్వాత పెద్ద నిర్మాణాల వరకు వెళ్లిందని ఆరోపిస్తున్నారు. ఈ వాదనలు నిజమైతే, ఒక్కరోజులో లేదా ఒక్క అధికారి కాలంలో జరిగిన వ్యవహారంగా దీన్ని చూడలేం.

ప్రతి దశలో ఎవరో ఒకరు చూడాల్సిందే కదా?

భూమి చదును చేస్తే రెవెన్యూ వ్యవస్థకు సమాచారం రావచ్చు.

నిర్మాణం మొదలైతే పంచాయతీకి కనిపిస్తుంది.

కరెంట్ కనెక్షన్ వస్తే విద్యుత్ శాఖలో రికార్డు ఉంటుంది.

నీటి కనెక్షన్ ఉంటే సంబంధిత శాఖ వద్ద సమాచారం ఉంటుంది.

కమర్షియల్ వినియోగం ప్రారంభమైతే పన్నులు, లైసెన్సులు, ఇతర అనుమతుల అంశం తెరపైకి వస్తుంది.

అంటే ఒక భారీ నిర్మాణం పూర్తిగా వ్యవస్థ దృష్టికి రాకుండా సాగడం సాధారణంగా కష్టమే.

**అందుకే స్థానికులు అడుగుతున్న ప్రశ్న---**

"ఇంతకాలం ఎవరూ చూడలేదా? చూసినా చర్య తీసుకోలేదా?"

నోటీసుల ఫైళ్లను బయటపెట్టాలి

అధికారులు గతంలో నోటీసులు ఇచ్చి ఉంటే వాటి తేదీలు, కారణాలు, సంబంధిత వ్యక్తుల పేర్లు, తదుపరి చర్యల వివరాలు బహిర్గతం చేయాలి.

ఎందుకంటే నోటీసు ఇచ్చి సంవత్సరాల తరబడి చర్య తీసుకోకపోతే అది పరిపాలనా నిర్లక్ష్యంగా మారే అవకాశం ఉంటుంది.

అయితే అధికారులపై నేరుగా ఆరోపణలు చేయడానికి ముందు వారి అధికారిక వివరణను కూడా నమోదు చేయడం అవసరం.

**ప్రభుత్వ ఖజానాకు నష్టం జరిగిందా?**

ప్రభుత్వ లేదా కేటాయింపు భూమి కమర్షియల్ వినియోగంలోకి మారి ఉంటే, దాని వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం జరిగిందా? పన్నులు చెల్లించారా? భూమి వినియోగ మార్పు చట్టబద్ధంగా జరిగిందా? అనే అంశాలను కూడా పరిశీలించాలి.

ప్రభుత్వ భూమిపై ప్రైవేటు వ్యక్తులు వాణిజ్య ఆదాయం పొందుతున్నారన్న స్థానికుల ఆరోపణలు నిజమైతే, అది తీవ్రమైన అంశమే.

కానీ దీనిపై తుది నిర్ధారణకు అధికారిక భూ రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, రెవెన్యూ నమోదు, పన్ను వివరాలను పరిశీలించాల్సి ఉంటుంది.

**పేదల కోసం ఇచ్చిన భూమి... చివరకు ఎవరి చేతిలో?**

ఈ వ్యవహారంలో అత్యంత ముఖ్యమైన ప్రశ్న ఇదే.

నిరుపేదలకు జీవనాధారం కోసం కేటాయించిన డి-పట్టా భూములు నిజంగా వారి ఆధీనంలోనే ఉన్నాయా?

లేక ఇతరుల చేతుల్లోకి వెళ్లాయా?

**వెళ్లి ఉంటే---**

అమ్మకాలు జరిగాయా?

పవర్ ఆఫ్ అటార్నీలు ఇచ్చారా?

బినామీ లావాదేవీలు జరిగాయా?

రెవెన్యూ రికార్డుల్లో మార్పులు జరిగాయా?

అనే అంశాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**'పెన్ పవర్' డిమాండ్ కాదు... ప్రజల ప్రశ్న**

ఈ వ్యవహారంలో ఎవరినీ ముందుగానే దోషిగా నిర్ధారించడం లక్ష్యం కాదు.కానీ ప్రభుత్వ ఆస్తులపై, పేదలకు కేటాయించిన భూములపై తీవ్రమైన ఆరోపణలు వచ్చినప్పుడు జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన బాధ్యత ఉంది.

**స్థానికుల ప్రధాన డిమాండ్లు ఇవి:**

సర్వే నంబర్లు 202, 206/2కు ప్రత్యేక రీ-సర్వే నిర్వహించాలి.

ప్రభుత్వ, డి-పట్టా, ప్రైవేటు భూముల హద్దులను గుర్తించాలి.

అన్ని నిర్మాణ అనుమతులను పరిశీలించాలి.

కోర్టు ఉత్తర్వుల అమలు స్థితిని వెల్లడించాలి.

విద్యుత్, వాటర్ కనెక్షన్లకు సమర్పించిన పత్రాలను తనిఖీ చేయాలి.

ఖఖణా/పంచాయతీ అనుమతుల చట్టబద్ధతను నిర్ధారించాలి.

అధికారుల నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి.

ప్రభుత్వ భూమి ఆక్రమణ నిర్ధారణ అయితే చట్టప్రకారం తిరిగి స్వాధీనం చేసుకోవాలి.

**జిల్లా యంత్రాంగం స్పందిస్తుందా?**

సూరంపాలెం వ్యవహారం ఇప్పుడు కేవలం ఒక భూమి వివాదంగా కాకుండా, ప్రభుత్వ భూముల పరిరక్షణ వ్యవస్థ ఎంత సమర్థంగా పనిచేస్తోందన్న ప్రశ్నగా మారుతోంది.

రికార్డులు తెరిస్తే నిజం బయటపడుతుంది.

సర్వే చేస్తే హద్దులు తేలుతాయి.

అనుమతుల ఫైళ్లు పరిశీలిస్తే నిర్మాణాల చట్టబద్ధత తెలుస్తుంది.

కోర్టు ఉత్తర్వులు పరిశీలిస్తే ఎవరు వాటిని పాటించారు, ఎవరు పాటించలేదన్నదీ స్పష్టమవుతుంది.

**చివరి ప్రశ్న ఒక్కటే...**

సూరంపాలెంలో చట్టమే నడిచిందా?

లేక చట్టాన్ని మించి ఎవరి ప్రభావమైనా పనిచేసిందా?

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సింది ఇప్పుడు జిల్లా యంత్రాంగమే.

## సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి





**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 9:** కోనసీమ తిరుమలగా విరాజిల్లుతున్న వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారిని గోవర్ధన పీఠం, పూరికి చెందిన జగద్గురు శంకరాచార్య శ్రీ శ్రీ శ్రీ ఆద్యోక్షజానంద స్వామీజీ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయానికి విచ్చేసిన జగద్గురు శంకరాచార్య స్వామీజీకి ఆలయ అర్చకులు సాదర స్వాగతం పలికారు. దర్శనానంతరం స్వామివారి ఆశీర్వచనాలు అందజేసి, చిత్రపటంతో పాటు తీర్థప్రసాదాలను బహూకరించారు.

ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణ, వేద సంస్కృతి పరిరక్షణ, గోసంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు సమాజంలోని ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. భారతీయ ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకలైన వేద సంప్రదాయాలు, ధార్మిక విలువలను భావితరాలకు వారసత్వ సంపదగా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఉద్బోధించారు. సమాజంలో ఆధ్యాత్మిక చింతనను పెంపొందిస్తూ ధర్మబద్ధమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిండెంట్ పులపర్తిరాంబాబు, అర్చక స్వాములు, సిబ్బంది పాల్గొన్నారు.

## మురారి--రామయ్యపాలెం రహదారి నిర్మాణానికి శంకుస్థాపన





- రూ.4.49 కోట్లతో 5.279 కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణం
- పనులు పూర్తయితే రైతులు, భక్తులు, గ్రామస్తులకు ప్రయోజనం
- ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**గండేపల్లి, పెన్ పవర్,అక్టోబర్ 09 :** కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో పల్లె పండుగ 3.0 అభివృద్ధి జాతరలో భాగంగా మురారి నుంచి దుర్గమ్మ పాదాల మీదుగా రామయ్యపాలెం వరకు 5.279 కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సాస్ నిధుల నుంచి రూ.4 కోట్ల 49 లక్షల అంచనా వ్యయంతో ఈ రహదారి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఈ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి జాస్తి వసంత్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ గ్రామీణ రహదారుల అభివృద్ధిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రహదారులు నిర్లక్ష్యానికి గురయ్యాయని పేర్కొన్నారు. మురారి నుంచి దుర్గమ్మ పాదాల మీదుగా రామయ్యపాలెం వెళ్లే రహదారి ఎన్నో ఏళ్లుగా అధ్వానంగా ఉండటంతో భక్తులు, రైతులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.

ఈ సమస్యను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లగానే స్పందించి రూ.449 లక్షలు మంజూరు చేశారని వివరించారు. రహదారి నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంత ప్రజలకు, రైతులకు, దుర్గమ్మ ఆలయానికి వెళ్లే భక్తులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలో రహదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఇప్పటికే చిల్లంగి నుంచి పెద్దనాపల్లి మీదుగా వేలంక వరకు రహదారి పనులకు శంకుస్థాపన చేశామని, శుక్రవారం ఇర్రిపాక నుంచి కాండ్రేగుల వరకు రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఈ కార్యక్రమంలో కోర్పు లచ్చయ్యదొర, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు, పుష్కర ప్రాజెక్టు కమిటీ చైర్మన్ అడబాల భాస్కరరావు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు కందుల చిట్టిబాబు, మాజీ వైస్ ఎంపీపీ కుంచె రాజా, పంచాయతీరాజ్ ప్రాజెక్టుల డీఈ గంగాధరం, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, యర్రంశెట్టి బాబ్జి, బొల్లంరెడ్డి రామకృష్ణ, అడబాల రామాంజనేయులు, బొండా శ్రీనుబాబు, చావా నరసింహమూర్తి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుంకవిల్లి రాజు, ఉండవల్లి బుల్లియ్య, గద్దె అబన్న, కూటమి నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రూ.1.14 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**కాజులూరు, పెన్ పవర్,అక్టోబర్ 9:** రామచంద్రపురం నియోజకవర్గంలో గ్రామీణ రహదారుల అభివృద్ధికి, గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని కూటమి పార్టీల సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం తెలిపారు. పల్లె పండుగ 3.0, రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని కాజులూరు మండలంలో రూ.1.14 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రెండు రహదారి అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన అధికారులు, కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు.ఆత్రేయ గోదావరి పుష్కర ఘాట్‌కు వెళ్లే అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి రూ.75 లక్షలు, పెదలంక--కోలంక రహదారి మిగిలిన పనుల పూర్తికి రూ.39 లక్షలు కేటాయించినట్లు వాసంశెట్టి సత్యం వెల్లడించారు. ఈ రెండు పనులు పూర్తయితే గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఘాట్‌లకు చేరుకోవడం సులభతరం అవుతుందని,ఆయా గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ప్రయాణ సమయం తగ్గడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో రహదారి కనెక్టివిటీ బలోపేతం అవుతుందని తెలిపారు.రామచంద్రపురం నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని సత్యం అన్నారు. నియోజకవర్గంలో రహదారులు, మౌలిక సదుపాయాలు, ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాల కోసం సుమారు రూ.250 కోట్లకు పైగా నిధులు తీసుకువచ్చి అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు,పుష్కరాల వంటి ప్రధాన ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అవసరమైన సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయడం ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మధుసూదనరావు, తహసీల్దార్ రవీంద్రనాథ్



ఠాగూర్, ఎంపీడీవో జె. రాంబాబు, డీఈ సత్య శ్రీనివాస్, ఏఈ భవాని శంకర్, కాజులూరు మండల టీడీపీ అధ్యక్షుడు చవ్వాకుల నారాయణమూర్తి, జనసేన మండల అధ్యక్షుడు బొండా వెంకన్న, యాళ్ల కృష్ణారావు, సలాది సాయిబాబు,వనుం వీరబ్రహ్మం, యాళ్ల సత్యనారాయణ,రెడ్డి శేషారావు,జల్లి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పోతుల గనిరాజు,చందాల ఆదినారాయణ,వల్లు అర్జున రావు మేడిశెట్టి పెద్దతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రపంచ టాప్ 2% శాస్త్రవేత్తల జాబితాలో ఆదిత్య యూనివర్సిటీకి చెందిన నలుగురు అధ్యాపకులు






### వరుసగా మూడో ఏడాది అంతర్జాతీయ గుర్తింపు

**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్ 09:** పరిశోధన రంగంలో ఆదిత్య యూనివర్సిటీ మరో విశేష గుర్తింపును సాధించింది. 2026 సంవత్సరానికి సంబంధించి ప్రపంచంలోని టాప్ 2 శాతం శాస్త్రవేత్తల జాబితాలో యూనివర్సిటీకి చెందిన నలుగురు అధ్యాపకులు స్థానం సంపాదించినట్లు ప్రో ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ఎల్సెవియర్ , స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీతో అనుసంధానమైన ఈ గుర్తింపు అధ్యాపకుల పరిశోధనా ప్రతిభకు, శాస్త్రీయ రంగంలో వారు చేస్తున్న కృషికి నిదర్శనమని పేర్కొన్నారు.ఈ అంతర్జాతీయ గుర్తింపు పొందిన వారిలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డా. పి.వి. ఎలుమలై, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డా. మహేష్ కుమార్ సింగ్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా. బి. రామ్మోహన్ రెడ్డి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా. తాతబాబు అద్దేపల్లి ఉన్నారు.

ఆదిత్య యూనివర్సిటీకి వరుసగా మూడేళ్లపాటు ప్రపంచంలోని టాప్ 2 శాతం శాస్త్రవేత్తల జాబితాలో గుర్తింపు లభించడం విశేషమని సతీష్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పరిశోధన, నూతన ఆవిష్కరణలు, నాణ్యమైన శాస్త్రీయ ప్రచురణలను ప్రోత్సహించడంలో యూనివర్సిటీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ విజయం అధ్యాపకుల నిరంతర పరిశోధనా తపనకు, విద్యా రంగంలో యూనివర్సిటీ సాధిస్తున్న ప్రగతికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ గుర్తింపు అధ్యాపకులతోపాటు పరిశోధక విద్యార్థులు, ఇతర విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందని యూనివర్సిటీ వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన అధ్యాపకులకు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. మేడపాటి శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.బి. శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్లు డా. ఎస్. రమాశ్రీ, డా. ఏ. రమేష్, డా. రవి తంగజన్, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, వివిధ విభాగాల డీన్లు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని పరిశోధనా విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# జగ్గంపేటలో కూటమి సుపరిపాలనకు నిదర్శనం



**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్ 9** జగ్గంపేట నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందని, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రజల సమస్యల పరిష్కారానికి తక్షణమే స్పందిస్తూ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేస్తున్నారని గండేపల్లి మండల జనసేన నాయకుడు, జగ్గంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ సింగులూరి రామ్ దీప్ అన్నారు. ముఖ్యంగా జనసేన నాయకులకు తగిన గౌరవం ఇస్తూ, వారు తీసుకొచ్చే ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.గండేపల్లి మండలం సుబ్బయ్యపేట గ్రామానికి చెందిన బోండా సీతారామయ్య అనారోగ్యంతో చికిత్స పొందగా, వైద్య ఖర్చులకు సంబంధించిన బిల్లులను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు అందజేసినట్లు రామ్ దీప్ తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.1,53,000

- ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ
- సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదలకు అండగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వం

మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నారని వెల్లడించారు. మంజూరైన చెక్కును కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ లబ్ధిదారుడి ఇంటికి స్వయంగా వెళ్లి అందజేశారని చెప్పారు. ఇప్పటివరకు సుబ్బయ్యపేట గ్రామంలో జనసేన నాయకుల చొరవతో సుమారు రూ.8 లక్షల విలువైన ఏడు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, లెటర్స్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ) మంజూరయ్యాయని రామ్ దీప్ వివరించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అనారోగ్య సమయంలో ఆర్థిక భరోసా కల్పించడంలో ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించి, తనను ప్రోత్సహిస్తున్న జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కు, తనకు గుర్తింపునిచ్చి తన ద్వారా మరింతమందికి సేవ చేసే అవకాశం కల్పించిన జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు రామ్ దీప్ కృతజ్ఞతలు తెలిపారు. సుబ్బయ్యపేట గ్రామ జనసేన నాయకులు, కార్యకర్తల తరఫున కూడా ధన్యవాదాలు తెలియజేశారు.

# ఈ నెల 11 నుంచి కాకినాడ శ్రీపీఠంలో మహాశక్తి యాగం--2026





- 2030 నాటికి వెయ్యి కోట్ల కుంకుమార్చనలు పూర్తి చేయడమే లక్ష్యం
- దేశానికి ఆర్థిక మాంద్యం రాదు
- పరిపూర్ణానంద సరస్వతి

**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 9:** దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని కాకినాడ శ్రీపీఠంలో మహాశక్తి యాగం--2026ను ఈ నెల 11 నుంచి 21వ తేదీ వరకు 11 రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు శ్రీపీఠం వ్యవస్థాపకుడు పరిపూర్ణానంద సరస్వతి వెల్లడించారు.భక్తుల సహకారంతో నిర్వహిస్తున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. శుక్రవారం శ్రీపీఠంలో నిర్వహించిన కార్యక్రమంలో యాగం వివరాలను వెల్లడించారు.ఈ సందర్భంగా పరిపూర్ణానంద సరస్వతి మాట్లాడుతూ, శ్రీ ఐశ్వర్యాంబిక అమ్మవారి ఆశీస్సులతో వరుసగా నాలుగో ఏడాది 400 కోట్ల కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా మహిళల భాగస్వామ్యంతో లలితా సహస్రనామ పూర్వకంగా 300 కోట్ల కుంకుమార్చనలు నిర్వహించినట్లు గుర్తుచేశారు. 2030 నాటికి మొత్తం వెయ్యి కోట్ల కుంకుమార్చనలు పూర్తి చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.భక్తుల ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు అమ్మవారి అనుగ్రహాన్ని పొందే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.24 వేల మంది విద్యార్థులతో సరస్వతీ పూజ

మహాశక్తి యాగంలో భాగంగా ఈ నెల 17వ తేదీ ఉదయం 6 గంటల నుంచి సుమారు 24 వేల మంది విద్యార్థులతో భారీ స్థాయిలో సరస్వతీ పూజ నిర్వహించనున్నట్లు పరిపూర్ణానంద సరస్వతి తెలిపారు.విద్యార్థుల్లో విద్యాభివృద్ధి, జ్ఞానసంపద, ఏకాగ్రత పెంపొందించాలనే సంకల్పంతో ఈ పూజను నిర్వహిస్తున్నట్లు వివరించారు. అలాగే ఈ నెల 18వ తేదీ అష్టమి సందర్భంగా ఉదయం పది వేల మంది మహిళలచే ఐశ్వర్య దీప పూజ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.అదే రోజు సాయంత్రం వేద, ఆగమశాస్త్ర పండితుల సూచనల మేరకు సహస్ర కుండాత్మక నవశక్తి హోమాలను నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా బగళాముఖి, చండీ, వారాహి,సిద్ధ కుంజిక, మహాదుర్గ,అపరాజిత,శక్తి కవచం,ప్రత్యంగిరా,చండీ ధ్వజం తదితర నవశక్తి హోమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణ

యాగం జరిగే 11 రోజులపాటు శ్రీ ఐశ్వర్యాంబిక అమ్మవారికి ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అర్చనలు,విశేష పూజలు, నైవేద్య కార్యక్రమాలు నిర్వహిస్తామని పరిపూర్ణానంద సరస్వతి తెలిపారు. భక్తుల కోసం ప్రతిరోజూ అన్నప్రసాద వితరణ కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తులు, మహిళలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాశక్తి యాగాన్ని విజయవంతం చేయాలని, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.మహాశక్తి యాగానికి అన్ని ఏర్పాట్లు పూర్తి గత మూడేళ్లుగా మహాశక్తి యాగాన్ని భక్తుల సహకారంతో విజయవంతంగా నిర్వహించామని, అదే ఉత్సాహంతో ఈ ఏడాది కూడా నాలుగోసారి మరింత వైభవంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యామని పరిపూర్ణానంద సరస్వతి తెలిపారు.యాగానికి సంబంధించి అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని పేర్కొన్నారు.ఆలయ కమిటీ సభ్యులు వివిధ బృందాలుగా ఏర్పడి గత నెల రోజులుగా యాగం నిర్వహణ కోసం నిరంతరం శ్రమిస్తున్నారని, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. కమిటీ సభ్యుల కృషి పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. తన బంధుమిత్రుల సహకారంతో అవసరమైన నిధులు, ద్రవ్యాలను సమకూర్చుకుని కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు వివరించారు.దేశ ఆర్థిక పరిస్థితిపై పరిపూర్ణానంద వ్యాఖ్యలు చేశారు.ఈ సందర్భంగా దేశ ఆర్థిక పరిస్థితిపై కూడా పరిపూర్ణానంద సరస్వతి తన అభిప్రాయాలను వెల్లడించారు. భారతదేశానికి ఆర్థిక మాంద్యం వచ్చే పరిస్థితి ఉండదని ఆయన జోస్యం చెప్పారు. ప్రధానమంత్రి నుంచి కిందిస్థాయి ప్రజాప్రతినిధుల వరకు ప్రజాసేవే లక్ష్యంగా జీతభత్యాలు లేకుండా పనిచేస్తే, దేశం మరిన్ని రంగాల్లో ముందంజలో నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.మహాశక్తి యాగం ద్వారా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు భక్తుల్లో భక్తిభావం, సామాజిక ఐక్యత పెంపొందుతాయని పేర్కొంటూ, ఈ నెల 11 నుంచి 21వ తేదీ వరకు జరిగే కార్యక్రమాల్లో భక్తులందరూ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని పరిపూర్ణానంద సరస్వతి పిలుపునిచ్చారు.

## ఆదిత్య డిగ్రీ కళాశాలలో 'నషా ముక్త్ భారత్' అవగాహన కార్యక్రమం

- మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటేనే నవభారత నిర్మాణం
- డాక్టర్ వి. కాటన్




**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 9:** యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకున్నప్పుడే నవభారత నిర్మాణం సాధ్యమవుతుందని కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సైకియాట్రిస్ట్ డాక్టర్ వి. కాటన్ అన్నారు.వికసిత్ భారత్ నిర్మాణంలో భాగంగా భారత ప్రభుత్వ యువజన,క్రీడా వ్యవహారాల శాఖ పిలుపుమేరకు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శుక్రవారం 'నషా ముక్త్ భారత్'యువమేలా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన డాక్టర్ వి.కాటన్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక సమస్యలను వివరించారు.మాదకద్రవ్యాల అలవాటు విద్యార్థుల ఆరోగ్యంతో పాటు వారి విద్యాభ్యాసం,వ్యక్తిగత జీవితం, భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు ఆకర్షితులు కాకుండా అప్రమత్తంగా ఉండాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకం.యువత దేశ భవిష్యత్తుకు ప్రతినిధులని, వారు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు అన్నారు.విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహద పడతాయని తెలిపారు.మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని, విద్యార్థులు తమ స్నేహితులు, కుటుంబ సభ్యులు, సమాజంలోనూ ఈ అంశంపై అవగాహన కల్పించాలని సూచించారు.యువత ఆరోగ్యంగా,బాధ్యతాయుతంగా ఎదిగినప్పుడే దేశ అభివృద్ధికి మరింతగా దోహదపడగలరని పేర్కొన్నారు. నిర్వాహకులకు అభినందనలుఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి,డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యత,ఆరోగ్యంపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు టి. తేజేశ్వరరావు, డి.అశ్విని,ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.ు

## వీఆర్ఏ కుటుంబాలకు రెవెన్యూ సిబ్బంది చేయూత




**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 9:**మండల కేంద్రంలో గత 24 రోజులుగా తమ సమస్యలను పరిష్కరించాలని, జీతభత్యాలు లేక ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను తొలగించాలని కోరుతూ సమ్మె చేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) కుటుంబాలకు ఆత్రేయపురం తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, రేషన్ దుకాణాల డీలర్లు మానవతా దృక్పథంతో అండగా నిలిచారు. సమ్మె కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వీఆర్ఏ కుటుంబాలకు నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేసి తమ సంఘీభావాన్ని చాటుకున్నారు.

ఈ సందర్భంగా ఒక్కో కుటుంబానికి 10 కిలోల బియ్యం, ఒక కిలో పంచదార, ఒక కిలో కందిపప్పు, ఒక కిలో పామాయిల్, ఒక కిలో గోధుమ పిండి, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు తదితర నిత్యావసర వస్తువులను అందజేశారు. జీతభత్యాలు లేక జీవనోపాధికి ఇబ్బందులు పడుతున్న వీఆర్ఏ కుటుంబాలకు ఈ సహాయం కొంత ఊరటనిచ్చింది.ఈ కార్యక్రమంలో ఆత్రేయపురం తహశీల్దార్ రామచంద్రమూర్తి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వినాయకుడు, కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, రేషన్ దుకాణాల డీలర్లు పాల్గొన్నారు.

## జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులకు మెగా వైద్య శిబిరం



**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 9:** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా శుక్రవారం కాకినాడలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. అనిత ఈ శిబిరాన్ని ప్రారంభించారు. శాఖకు చెందిన ఉద్యోగులతో పాటు పలువురు సిబ్బంది శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ సందర్భంగా డాక్టర్ కె. అనిత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విధి నిర్వహణలో బిజీగా ఉన్నప్పటికీ ఆరోగ్య పరీక్షల కోసం సమయం కేటాయించాలని, ఇటువంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వైద్యులు ఇచ్చే సలహాలు, సూచనలను పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పేర్కొన్నారు. వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణతో పాటు కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై కూడా శ్రద్ధ చూపాలని సూచించారు. ముందస్తు వైద్య పరీక్షల ద్వారా ఆరోగ్య సమస్యలను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చని వివరించారు.ఈ మెగా వైద్య శిబిరం నిర్వహణను ఏవో ప్రభాకర్ రావు, కార్యాలయ సిబ్బంది పర్యవేక్షించారు.

## ఏడువారాల వెంకన్న సన్నిధిలో భక్తిభావ పరవశం

- వాడపల్లి క్షేత్రానికి తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తుల రాక
- నిత్యాన్నదాన పథకానికి రూ.1,01,116 విరాళం అందజేసిన రాజమహేంద్రవరం దంపతులు






**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 9:** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి పుణ్యక్షేత్రం ఏడువారాల వెంకన్న నామస్మరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటోంది. చందన స్వరూపుడైన శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. స్వామివారిపై అపారమైన విశ్వాసంతో ఏడువారాల నోము నోచుకున్న భక్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు.శుక్రవారం స్వామివారి దర్శనార్థం వచ్చిన భక్తులు ఆలయ సన్నిధిలో నిర్వహించిన అష్టోత్తర పూజా కార్యక్రమాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. వేదమంత్రోచ్ఛారణలు, స్వామివారి నామస్మరణ మధ్య పూజలు నిర్వహించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఏడువారాల వెంకన్నను దర్శించుకుంటే తమ కోరికలు నెరవేరుతాయని విశ్వసించే భక్తులు కుటుంబ సమేతంగా క్షేత్రానికి చేరుకుని స్వామివారి కృపాకటాక్షాల కోసం ప్రార్థనలు చేశారు.

**అన్నదాన సేవకు దాతల చేయూత**

భక్తులకు ఆధ్యాత్మిక సేవతోపాటు అన్నప్రసాదాన్ని అందించాలనే సంకల్పంతో ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకం భక్తులకు విశేష సేవలందిస్తోంది. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు నిత్యాన్నప్రసాదాన్ని స్వీకరించిన అనంతరం తమకు తోచిన విధంగా విరాళాలు సమర్పిస్తూ అన్నదాన కార్యక్రమానికి తోడ్పాటునందిస్తున్నారు. భగవంతుని సేవలో భాగంగా ఆకలితో వచ్చిన వారికి అన్నం అందించడం పుణ్యప్రదమైన కార్యమనే భావనతో పలువురు దాతలు ముందుకు వస్తున్నారు.ఈ క్రమంలో రాజమహేంద్రవరానికి చెందిన చెరుకూరి వెంకటేశ్వరరావు, శ్రీలాల్ మీనాక్షి దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలోని నిత్యాన్నదాన పథకానికి రూ.1,01,116 విరాళంగా సమర్పించారు. భక్తులకు నిరంతరంగా అన్నప్రసాదం అందించే పవిత్ర కార్యక్రమానికి తమ వంతు సహకారం అందించడం పట్ల ఆలయ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.వేదమంత్రాలతో దాతలకు ఆశీర్వచనం నిత్యాన్నదాన పథకానికి విరాళం అందజేసిన దాతలను ఆలయ అర్చకులు అభినందించారు. అనంతరం వేదమంత్రోచ్ఛారణల నడుమ వారికి ఆశీర్వచనం అందించి, శ్రీ వేంకటేశ్వర స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. స్వామివారి సేవలో భాగస్వాములైన దాతలకు స్వామివారి అనుగ్రహం కలగాలని అర్చకులు ఆకాంక్షించారు.భక్తుల రాకతో వాడపల్లి క్షేత్రంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంటుండగా, దర్శనాలు, ప్రత్యేక పూజలు, నిత్యాన్నదాన కార్యక్రమాలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తున్నాయి. భక్తుల సహకారంతో నిత్యాన్నదాన పథకం మరింత సమర్థవంతంగా కొనసాగుతూ అన్నదాన సేవా స్ఫూర్తిని చాటుతోంది.ర

## ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్




**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 9:**ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించడమే లక్ష్యంగా ప్రతి శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు వారి సమస్యలకు సత్వర పరిష్కారాలు చూపేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు.జగన్నాథపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో కొండబాబు ప్రజల నుంచి వినతిపత్రాలు, అర్జీలను స్వయంగా స్వీకరించారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో అక్కడికక్కడే సమీక్షించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పౌర సేవలందించడంలో అధికారులు ఎలాంటి జాప్యం చేయరాదని, ప్రజల సమస్యల పరిష్కారంలో జవాబుదారీతనంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు.అర్జీలపై తగిన పరిశీలన జరిపి,సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ప్రజా పరిపాలనను ప్రజల ముంగిటకు తీసుకెళ్లడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందని కొండబాబు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్,బలసాడి రంగారావు, ఒమ్మి బాలాజీ,అంగాడి దుర్గారావు, అంబటి చిన్న,సికోటి అప్పలకొండ, మూగు రాజు,ఎరిపిల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

# మొబైల్ మోజుకు దూరంగా.. ఉత్తరాల బాటలో చిన్నారులు!






**ప్రియదర్శిని బాలవిహారులో లేఖా రచన, తపాలా బిళ్లల ప్రదర్శన**

**ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా వినూత్న కార్యక్రమం**

**కొత్తపేట, పెన్ పవర్, అక్టోబర్ 9:**ప్రపంచ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకుని మొబైల్ ఫోన్లు, టెలివిజన్లకు అలవాటు పడుతున్న నేటితరం చిన్నారుల్లో ఉత్తరాలు రాసే అలవాటును పెంపొందించేందుకు ప్రియదర్శిని బాలవిహార్ యాజమాన్యం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా శుక్రవారం నిర్వహించిన లేఖా రచన కార్యక్రమంలో సుమారు 60 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ అమ్మమ్మలు, నాయనమ్మలు, తాతయ్యలు, ఇతర బంధువులకు ఉత్తరాలు రాశారు. అనంతరం ఉపాధ్యాయుల వెంట స్థానిక తపాలా కార్యాలయానికి చేరుకుని తాము రాసిన ఉత్తరాలను తపాలా పెట్టెలో వేశారు. ఆధునిక సమాచార సాధనాల మధ్య ఉత్తరాలు రాసి, వాటిని తపాలా ద్వారా పంపించే అనుభూతిని పొందడం చిన్నారులకు కొత్త అనుభవంగా నిలిచింది.ఈ సందర్భంగా పాఠశాల అకడమిక్ డైరెక్టర్ అద్దంకి సాహిత్య మాట్లాడుతూ.. దశాబ్దాల క్రితం కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలను పెంపొందించిన ఉత్తరాల సంస్కృతి క్రమంగా కనుమరుగవుతోందన్నారు.

ఇలాంటి కార్యక్రమాల ద్వారా పిల్లల్లో లేఖా రచనపై ఆసక్తి పెంచడంతోపాటు కుటుంబ సంబంధాల విలువను తెలియజేయవచ్చన్నారు. నాటి ఉత్తరాల సంస్కృతి పునరుద్ధరణకు ఈ కార్యక్రమం పునాది వేస్తుందని పేర్కొన్నారు.పాఠశాల కరస్పాండెంట్, తపాలా బిళ్లల సేకరణలో ఆసక్తి కలిగిన అద్దంకి బుద్ధ చంద్ర దేవ్ మాట్లాడుతూ.. తమ పాఠశాల విద్యార్థులే కాకుండా దేశవ్యాప్తంగా పిల్లలందరూ ప్రత్యేక సందర్భాల్లో బంధుమిత్రులకు ఉత్తరాలు రాయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. అక్టోబర్ 9న ప్రపంచ తపాలా దినోత్సవం, అక్టోబర్ 10న భారత జాతీయ తపాలా దినోత్సవం, 15వ తేదీ వరకు నిర్వహించే తపాలా వారోత్సవాల ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షలు ముగిసి దసరా సెలవులు ప్రారంభమవుతున్న తరుణంలో పిల్లలకు లేఖా రచన, తపాలా వ్యవస్థ, తపాలా బిళ్లల సేకరణపై అవగాహన కల్పించడం లక్ష్యమన్నారు.ఐదు దశాబ్దాలుగా తాను సేకరించిన అరుదైన తపాలా బిళ్లలు, ఇతర తపాలా సంబంధిత వస్తువులతో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. 1921లో రాసిన ఒక తపాలా కార్డు, చార్లెస్–డయానా కుటుంబ కలర్ చిత్రంతో ఇంగ్లాండ్‌లో విడుదలైన పాత తపాలా కార్డు, స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి విడుదలైన వివిధ తపాలా బిళ్లల వివరాలతో కూడిన పుస్తకాలు, ప్రత్యేక తపాలా బిళ్లలతో విడుదల చేసిన తొలిరోజు ముఖచిత్రాలు, చారిత్రక సమాచార కరపత్రాలు ప్రదర్శనలో ఆకట్టుకున్నాయి. వాటి విశేషాలను దేవ్ విద్యార్థులకు వివరించారు.అనంతరం నిర్వహించిన సభలో విద్యార్థులు మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్లు, టెలివిజన్లకు పరిమితం కాకుండా ఉపయోగకరమైన కార్యక్రమాల్లో పాల్గొంటామని ప్రతిజ్ఞ చేశారు. దసరా సెలవులను సద్వినియోగం చేసుకుంటూ డైరీలో ఇచ్చిన ఇంటి పనులను పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఏఎస్ఆర్ మూర్తి, గణిత ఉపాధ్యాయురాలు ఇరగవరపు ఇందు భార్గవి, తెలుగు పండిట్ బూసి నాని కుమారి, జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు కె. అనూష, ఇతర ఉపాధ్యాయినులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## కాకినాడలో ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్



- హెల్మెట్, అతివేగం, మైనర్ డ్రైవింగ్‌పై అవగాహన
- ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ
- పోలీసుల సూచన

**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 9:** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా కాకినాడ ట్రాఫిక్–1 పోలీసులు శుక్రవారం నగరంలోని ప్రధాన రహదారిపై, టౌన్‌హాల్ వద్ద ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం,అతివేగం,మైనర్ డ్రైవింగ్,ట్రిపుల్ రైడింగ్,మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై అవగాహన కల్పించారు.కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఆదేశాల మేరకు, అదనపు ఎస్పీ డాక్టర్ ఎం. కిషోర్ కుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు రహదారి భద్రతపై పలు సూచనలు చేశారు.ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ప్రమాద సమయంలో తలకు తీవ్ర గాయాలు కాకుండా రక్షణ కల్పిస్తుందని వివరించారు.ముఖ్యంగా యువత అతివేగంతో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశాలు పెరుగుతాయని, వేగ నియంత్రణ పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని సూచించారు.

**మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు**

డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారే వాహనాలు నడపాలని పోలీసులు స్పష్టం చేశారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలు జరిగి వారి ప్రాణాలకు ముప్పు ఏర్పడటమే కాకుండా, తల్లిదండ్రులు తీవ్ర విషాదాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్ చేయడం వల్ల వాహనంపై నియంత్రణ కోల్పోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల డ్రైవర్ల నిర్ణయ సామర్థ్యం, ప్రతిస్పందన వేగం తగ్గి ప్రమాదాలు సంభవిస్తాయని పేర్కొన్నారు. వాహనం నడిపేటప్పుడు మొబైల్ ఫోన్ ఉపయోగించడం కూడా ప్రమాదకరమని, డ్రైవింగ్ సమయంలో పూర్తిస్థాయి దృష్టిని రహదారిపైనే ఉంచాలని సూచించారు.

**ట్రాఫిక్ సిగ్నల్స్,జీబ్రా క్రాసింగ్‌పై అవగాహన**

నగరంలోని ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఎరుపు లైట్ వెలిగినప్పుడు వాహనాలను నిలిపివేయాలని,పాదచారులు రహదారి దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్‌ను ఉపయోగించాలని పోలీసులు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించడంతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడవచ్చని వివరించారు.

**ప్రమాద బాధితులకు సాయం చేయండి**

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సకాలంలో సహాయం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పోలీసులు తెలిపారు. ప్రమాద బాధితులకు సహాయం చేసే వారికి 'గుడ్ సమారిటన్' పథకం కింద రూ.25,000 నగదు ప్రోత్సాహకం అందించే అవకాశం ఉందని, సంబంధిత నిబంధనల ప్రకారం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఈ బహుమతి అందజేస్తారని వివరించారు.అలాగే రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు నగదు రహిత ఉచిత వైద్య చికిత్స అందించే సదుపాయం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులకు వీలైనంత త్వరగా వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్–1 పోలీస్ స్టేషన్ సీఐ ఎన్.రమేష్,ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ,తమతో పాటు ఇతరుల ప్రాణాల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని పోలీసులు కోరారు.

## రూ.1.01 కోట్లతో నిర్మించిన నాలుగు హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించిన మంత్రి వాసంశెట్టి సుభాష్





**రామచంద్రపురం/కె. గంగవరం, పెన్ పవర్ అక్టోబర్ 9:**గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్ర పురం నియోజకవర్గ పరిధిలో రూ.1.01 కోట్ల వ్యయంతో నిర్మించిన నాలుగు విలేజ్ హెల్త్ క్లినిక్‌లను శుక్రవారం అధికారులు, కూటమి నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోనే ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా అవుతాయని, ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలోని అద్దంపల్లి, యనమదల, కందులపాలెం, వెల్ల–1 గ్రామాల్లో ఈ హెల్త్ క్లినిక్‌లను నిర్మించారు.అద్దంపల్లిలో క్లినిక్ భవన నిర్మాణానికి రూ.17.78 లక్షలు, యనమదలలో రూ.20.40 లక్షలు, కందులపాలెంలో రూ.26.95 లక్షలు, వెల్ల–1లో రూ.36 లక్షలు వెచ్చించినట్లు మంత్రి వెల్లడించారు.ఈ కేంద్రాల ద్వారా ఆయా గ్రామాల ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ కె.శ్రీనివాస్, ఎంపీడీవో పద్మజ్యోతి,ఏఈ యేసు రత్నం, రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పెంకే అన్నపూర్ణ,పెంకే సాంబశివరావు, వయిట్ల రాజబాబు,గజలక్ష్మి,జాస్తి విజయలక్ష్మి,దొమ్మలపాటి విజయలక్ష్మి, పలువురు వైద్యులు,వైద్య సిబ్బంది, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో టీడీపీలో చేరిన 120 మంది వైసీపీ శ్రేణులు





**కె. గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 9:** రామచంద్రపురం నియోజకవర్గం కె. గంగవరం మండలం కూళ్ల గ్రామంలో పామర్రు, కోట గ్రామాలకు చెందిన సుమారు 120 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సాదే కపిల్, మాజీ వైస్ సర్పంచ్ దడల సత్యనారాయణ, వార్డు సభ్యులు పంపన పెద్దబ్బు, కేసన సూర్యనారాయణతో పాటు పలువురు కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, మండల పార్టీ అధ్యక్షుడు మేడిశెట్టి రవికుమార్ తదితరులు పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. నాయకులంతా సమన్వయంతో పనిచేస్తూ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించాలని పేర్కొన్నారు. పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు మంత్రి వాసంశెట్టి సుభాష్ రామచంద్రపురం నియోజకవర్గం లో చేపడుతున్న అభివృద్ధి పనుల పట్ల ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు తెలిపారు. మంత్రి వ్యక్తిగతంగా అందిస్తున్న సహకారం, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు తమను ప్రభావితం చేశాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, ఆత్మ చైర్మన్ వెంటూరి వీరరాఘవ చౌదరి, మురర్జీ, చిర్రా సురేష్, కాకర్లపూడి రామచంద్ర రాజు, గంజా సత్యనారాయణ, వాసంశెట్టి బాలా తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు

# కాకినాడ జిల్లాలో స్పెషల్ టెట్--2026 నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు





**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 9:**కాకినాడ జిల్లాలో ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న ఏపీ స్పెషల్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (స్పెషల్ టెట్--2026)ను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన పరీక్షల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహిస్తున్న ఈ కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో ప్రతిరోజూ రెండు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. మొదటి షిఫ్ట్ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని వెల్లడించారు. పరీక్షా కేంద్రాల్లో కంప్యూటర్ వ్యవస్థలు, ఇంటర్నెట్ కనెక్టివిటీ సక్రమంగా పనిచేసేలా ముందస్తు తనిఖీలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏపీఈపీడీసీఎల్ అధికారులు నిరంతర విద్యుత్ సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను కాపాడేందుకు పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని అపూర్వ భరత్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో చట్టపరమైన నిబంధనల మేరకు భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమలు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారికి సూచించారు. రెండు పరీక్షా కేంద్రాల వద్ద తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు అవసరమైన బస్సు సర్వీసులను అందుబాటులో ఉంచాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ప్రతి కేంద్రం వద్ద తాగునీటి సదుపాయం కల్పించాలని నగరపాలక సంస్థ, తాళ్లరేవు మండల పరిషత్ అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బందితో కూడిన ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. పరీక్షల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించేందుకు విద్య, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులతో ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లాలోని రెండు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 4,465 మంది అభ్యర్థులు స్పెషల్ టెట్‌కు హాజరుకానున్నట్లు జాయింట్ కలెక్టర్ వెల్లడించారు. అచ్యుతాపురం రైల్వే గేట్ సమీపంలోని ఐఓఎన్ డిజిటల్ జోన్ , రాజీవ్ గాంధీ కంప్యూటింగ్ కేంద్రంలో 3,837 మంది, తాళ్లరేవు మండలం చొల్లంగి గ్రామంలోని ఐఓఎన్ డిజిటల్ జోన్ లో 625 మంది పరీక్షలు రాయనున్నట్లు వివరించారు.

అభ్యర్థులు తమ హాల్‌టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని, పరీక్ష ప్రారంభానికి ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి. రమేష్, డిప్యూటీ డీఈఓ కె.వి.ఎస్. సత్యనారాయణ, రెండు పరీక్షా కేంద్రాల ఇన్‌చార్జులు శాస్త్రి, వెంకటరెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



-పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ.

-2377, మంది రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు ,పెన్ పవర్, అక్టోబర్ 09:** రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరపుల సత్యప్రభరాజా అన్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మీ భూమి మీ హక్కు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ కార్యక్రమం తాసిల్దార్ సూర్యప్రభ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా రాష్ట్ర ఖాదీ చిన్న పరిశ్రమల వైస్ చైర్మన్ కొమ్ములు కన్నబాబు, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతులకు రాజ ముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను ఎమ్మెల్యే సత్యప్రభ చేతుల మీదగా స్థానిక నాయకులు సమక్షంలో రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ ధర్మవరం గ్రామంలో సుమారు 5166 ఎకరాలకలో 2700 మంది రైతులు ఉన్నారని అన్నారు. ఈ రీ సర్వే ,ల్యాండ్ పార్సిల్ మ్యాప్ విధానం ద్వారా 2377 మంది రైతులకు ప్రభుత్వ రాజ ముద్ర కలిగిన పాస్ పుస్తకాలను అందించడం జరిగిందన్నారు,ఇంకా కొంతమంది రైతులు తమ పంట పొలాలను రీ సర్వే చేయించుకోవలసి ఉన్నదని వారు సర్వే చేయించుకున్న వారం పది రోజులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందించడం జరుగుతుందని తెలిపారు.

రైతులు తమ వ్యవసాయ పనులు కోసం పంట పొలాలకు వెళ్లాలి తప్ప అర్జీలు పట్టుకొని భూ సమస్యలపై ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరిగే పరిస్థితి రాకూడదనే కూటమి ప్రభుత్వం రాజముద్రలతో కలిగిన పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్న బాబు,ఇందన ఏసుబాబు, బొల్లు చిన్నబాబు,అడ్డాల త్రిమూర్తులు, ఊట వీరబాబు, బోండాడ నారాయుడు, దాకారపు కృష్ణ,మండల వ్యవసాయ శాఖ అధికారిణి, జోకా అమృత,ఆర్ ఐ,గోపాలకృష్ణ విఆర్ఓ రాజేష్, తదితరులు పాల్గొన్నారు..

## తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడి సాధించాలి.

-ఏలూరు పొలంబడి కార్యక్రమంలో ఎ ఓ, జోకా అమృత.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, అక్టోబర్, 09:** తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి జోకా అమృత అన్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఏలూరు గ్రామంలో మండల వ్యవసాయ అధికారిణి జోకా అమృత ఆధ్వర్యంలో పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చార్టుల ప్రదర్శన ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఎలా సాధించవచ్చో రైతులకు వివరించారు. పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, మిత్ర పురుగులు, శత్రు పురుగులను గుర్తించే విధానాలను తెలియజేశారు. పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి, ప్రకృతి సిద్ధమైన ద్రావణాలు, కషాయాలను ఉపయోగించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని జోకా అమృత రైతులకు సూచించారు. పంటలకు మేలు చేసే మిత్ర పురుగులను సంరక్షించుకోవడం వల్ల పర్యావరణానికి మేలు



జరగడంతోపాటు నాణ్యమైన దిగుబడిని సాధించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులతో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది అర్జున్, వరహాలు, మణికంఠ పాల్గొన్నారు.

## కాకినాడలో నేటి నుంచి జాతీయ తపాలా వారోత్సవాలు

**కాకినాడ, పెన్ పవర్ అక్టోబర్ 9:**తపాలా సేవలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వివిధ పొదుపు పథకాలు, జీవిత బీమా సేవలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో కాకినాడ తపాలా డివిజన్‌లో ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు జాతీయ తపాలా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ కిండంగి కృష్ణ తెలిపారు. శుక్రవారం ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా ఈ వారోత్సవాలు ప్రారంభమవుతాయని ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ ఏడాది వారోత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ ఆదేశాల మేరకు పంచరత్న కాంటెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 9, 10 తేదీల్లో బాలికలకు 800 సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు ప్రారంభించడం, డివిజన్ పరిధిలో కనీసం 40 గ్రామాలను సంపూర్ణ సుకన్య గ్రామాలుగా గుర్తించడం, వివిధ రకాల పోస్టాఫీస్ సేవింగ్స్ బ్యాంక్ (పీఓఎస్‌బీ) ఖాతాలు 4,000 ప్రారంభించడం లక్ష్యంగా నిర్దేశించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీన తపాలా స్టాంపుల సేకరణలోని సాంస్కృతిక, విద్యా, చారిత్రక విశేషాలను విద్యార్థులకు, ప్రజలకు పరిచయం చేసే ఉద్దేశంతో 'ఫన్ విత్ ఫిలాటెలీ డే' నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 13 నుంచి 15వ తేదీ వరకు తపాలా జీవిత బీమా (పీఎల్ఐ), గ్రామీణ తపాలా జీవిత బీమా (ఆర్‌పీఎల్ఐ) పథకాలపై ప్రత్యేక మహామేళా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గతంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రధానంగా అందుబాటులో ఉన్న గ్రామీణ తపాలా జీవిత బీమా పథకాన్ని ఇప్పుడు పట్టణ, నగర ప్రాంత ప్రజలకు కూడా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు కృష్ణ తెలిపారు. తక్కువ ప్రీమియంతో బీమా ప్రయోజనాలు పొందే అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పథకానికి సంబంధించి అర్హతలు, నిబంధనల వివరాలను సమీప తపాలా కార్యాలయంలో తెలుసుకోవచ్చని సూచించారు. ఇదే కాకుండా విజయవాడ శ్రీ కనకదుర్గమ్మవారి లాకెట్, శక్తి కంకణం, అక్షింతలు, పూజ కుంకుమ, 'కనకదుర్గ ప్రభ' పుస్తకం, ప్రసాదంతో కూడిన పూజా సామగ్రిని రూ.116కే ప్రజల ఇంటి వద్దకు చేరవేసే సేవను తపాలా శాఖ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ సేవను పొందాలనుకునే వారు సమీప తపాలా కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. కాకినాడ, సామర్లకోట ప్రధాన తపాలా కార్యాలయాల్లో పార్సిల్ ప్యాకింగ్ సౌకర్యం అందుబాటులో ఉందని, ప్రజలు తమ విలువైన వస్తువులు, ఇతర సామగ్రిని దేశీయంగా, విదేశాలకు సరసమైన ధరలకు పంపించుకోవచ్చని వివరించారు. తపాలా వారోత్సవాల్లో భాగంగా అక్టోబర్ 9న కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు పాస్‌పోర్ట్ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తపాలా శాఖ అందిస్తున్న వివిధ సేవలు, పొదుపు పథకాలు, బీమా సదుపాయాలపై అవగాహన పెంపొందించుకుని ఈ వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ సూపరింటెండెంట్ కిండంగి కృష్ణ కోరారు

## పరిశ్రమల భాగస్వామ్య సదస్సు ప్రాంతీయ సమావేశాన్ని విజయవంతం చేయాలి





**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 9:** ఈ నెల 12వ తేదీ సోమవారం కాకినాడ జేఎన్టీయూలో నిర్వహించనున్న 31వ భారత పరిశ్రమల భాగస్వామ్య సదస్సు--2026 సన్నాహక ప్రాంతీయ సమావేశాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ఆదేశించారు. శుక్రవారం జేఎన్టీయూ ప్రాంగణంలో సదస్సు నిర్వహణకు చేపడుతున్న ముందస్తు ఏర్పాట్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. సదస్సు వేదిక రూపకల్పన, ప్రాంగణ సుందరీకరణ, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ఇతర ప్రతినిధుల వాహనాల పార్కింగ్, సీటింగ్ ఏర్పాట్లు,ఎల్ఈడీ స్క్రీన్ల ఏర్పాటు,వివిధ విభాగాలను సూచించే సైనేజీ బోర్డులు,మీడియా పాయింట్, భోజన సదుపాయాలు,ఎగ్జిబిషన్ స్టాళ్ల నిర్వహణ తదితర అంశాలను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈవెంట్ నిర్వాహకులు,వారి బృందంతో ఏర్పాట్ల పురోగతిపై సమీక్ష నిర్వహించి, అవసరమైన మార్పులు, మెరుగు దలలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా అపూర్వ భరత్ మాట్లాడుతూ సదస్సుకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, విధుల నిర్వహణలో పరస్పర సమన్వయం పాటించాలని ఆదేశించారు. సదస్సు విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎ. రమణారెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మణరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ గణపతి, ఈవెంట్ నిర్వాహకుల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విలేకరుల పై దాడులను అరికట్టాలి.

* మీడియాకు ప్రజా సంఘాల మద్దతు.






**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 9:** వార్తల సేకరణ విధి నిర్వహణలో ఉన్న ప్రత్తిపాడు మండల విలేకరిపై దాడిని ఖండిస్తూ ఏలేశ్వరం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు స్వర్ణ పూడి శ్రీనివాసరావు, శిడగం మాధవ లు మాట్లాడుతూ ప్రజలకి ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండే విలేకరులపై దాడులు పెరిగాయని అన్నారు. మీడియా స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్న అరాచక శక్తులను అణచివేసే బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. నిజాన్ని నిర్భయంగా అక్రమాలను వెలికి తీసే విలేకరులపై దాడులు చేయడం అన్యాయం అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ లో నాలుగో స్తంభం గా ఉన్న మీడియా హక్కులను కాలరాయడం పై ప్రతి ఒక్కరూ ఖండించవలసిన బాధ్యత ఉందన్నారు. నేటి వ్యవస్థలో భూ ఆక్రమణలు, దందాల పర్వం సాగుతుందని, ప్రశ్నించిన వారిపై భౌతిక దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. విలేకరులు చేపట్టిన ధర్నా నిరసన కార్యక్రమాలకు ప్రజా సంఘాలు తమ సంపూర్ణ మద్దతు పలికాయి. నిరసనకు మద్దతు తెలిపిన సిపిఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు మాట్లాడుతు ప్రత్తిపాడు మండలం లంపకలోవలో డి పట్టా భూమిలో అక్రమార్కులు మట్టి తవ్వకాలు, అక్రమ నిర్మాణాలు చేపట్టంపై వార్త కవరేజ్ కి వెళ్ళిన సిగిరెడ్డి రమేష్ పై తీవ్ర దాడిని ఖండిస్తున్నామన్నారు. సిపిఐ ( ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ నాయకులు కందుల ప్రసాద్, గండేటి నాగమణి మాట్లాడుతూ వ్యవస్థలో అన్యాయాలు, అక్రమాలు పెరిగిపోయాయని, భూ దందాలు జోరు ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం చేసుకుంటున్న వారి సంఖ్య పెరిగిందని ఆరోపించారు. విలేకరులు వ్యవస్థ ఉండబట్టే అక్రమాలు, అన్యాయాలు వెలుగు చూస్తున్నాయి అన్నారు. అనంతరం తహసిల్దార్ కె. కీర్తి కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి శ్రీనివాసరావు, షేక్ హస్సేన్, సాలా మల్లికార్జునరావు, అడపా దుర్గారావు, మువ్వల శ్రీను, మూరా రాజశేఖర్, ఆకుల శివాజీ, దాసరి కృష్ణ,గొల్లపల్లి రాజబాబు, వక్కలంక రామ్ ప్రసాద్ ప్రజా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు టీడీపీ కట్టుబడి ఉంది



**కాకినాడ రూరల్, పెన్ పవర్,అక్టోబర్ 9**: బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న లక్ష్యానికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిల్లి అనంత లక్ష్మి, సత్యనారాయణమూర్తి దంపతులు స్పష్టం చేశారు. బీసీల రాజకీయ, సామాజిక,ఆర్థిక అభ్యున్నతికి పార్టీ ఆవిర్భావం నుంచి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పార్టీ తరఫున అధిక సంఖ్యలో స్థానాలు కేటాయిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం తమ కార్యాలయం నుంచి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీ వర్గాలు పార్టీకి వెన్నెముకగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. బీసీల అభ్యున్నతికి ఎన్టీఆర్ హయాం నుంచి అనేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 24 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కు దక్కుతుందని,ఆ తర్వాత చంద్రబాబు వాటిని 34 శాతానికి పెంచారని గుర్తుచేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను తిరిగి 24 శాతానికి తగ్గించిందని విమర్శించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేసినట్లు వారు తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పుతో రిజర్వేషన్ల అమలులో న్యాయపరమైన ఇబ్బందులు ఎదురైనప్పటికీ, బీసీలకు రాజకీయంగా తగిన ప్రాధాన్యం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో న్యాయపరమైన పరిమితులకు అనుగుణంగా బీసీలకు పార్టీ తరఫున అధిక సంఖ్యలో స్థానాలు కేటాయిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం బీసీలకు రాజకీయ అవకాశాలను పెంపొందించే చర్యగా వారు అభివర్ణించారు. బీసీల హక్కుల పరిరక్షణ,వారి సమగ్ర అభ్యున్నతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పిల్లి అనంత లక్ష్మి, సత్యనారాయణమూర్తి దంపతులు పేర్కొన్నారు. బీసీ వర్గాల ప్రజలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలి

* బూత్ స్థాయిలో సమన్వయమే విజయానికి కీలకం
* ర్యాలిలో టీడీపీ బూత్ ఇన్‌చార్జిలతో యూనిట్ ఇన్‌చార్జి కందుల రాంబాబు సమావేశం



**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 9:**స్థానిక ఎన్నికలను పురస్కరించుకుని తెలుగుదేశం పార్టీ శ్రేణులను క్షేత్రస్థాయిలో సమాయత్తం చేయడం, సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠపరచడం లక్ష్యంగా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో శుక్రవారం రాజకీయ సమావేశం నిర్వహించారు. గ్రామంలోని గౌడ రామాలయం వద్ద బూత్ ఇన్‌చార్జిలతో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి కందుల రాంబాబు సమావేశమై పార్టీ భవిష్యత్ కార్యాచరణ, కార్యకర్తల బాధ్యతలు, ప్రజల్లో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా కందుల రాంబాబు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలోనే కాకుండా నిరంతరం ప్రజలతో మమేకమై ఉండటం పార్టీ కార్యకర్తల ప్రధాన బాధ్యతగా గుర్తించాలని సూచించారు. ప్రతి బూత్ పరిధిలోని కార్యకర్తల మధ్య సమన్వయం, పరస్పర సహకారం, సమష్టి కార్యాచరణకు ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో పార్టీ సంస్థాగత వ్యవస్థను బలోపేతం చేసేందుకు బూత్ ఇన్‌చార్జిలు క్రియాశీలక పాత్ర పోషించాలని, స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి చొరవ చూపాలని పిలుపునిచ్చారు. గత రెండేళ్లలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమానికి సంబంధించిన చర్యలను ప్రతి కార్యకర్తకు, పార్టీ సభ్యుడికి స్పష్టంగా అర్థమయ్యే రీతిలో వివరించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి పనుల వివరాలను ప్రజలకు చేరవేయడంలో వాస్తవాధారిత సమాచారానికి ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. ప్రతి బూత్ పరిధిలో పార్టీ శ్రేణులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలతో నిరంతర సంబంధాలను కొనసాగించాలని పేర్కొన్నారు.
స్థానిక ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం మరింత అవసరమని, క్షేత్రస్థాయిలో కార్యకర్తల చురుకైన భాగస్వామ్యంతోనే సంస్థాగత పునాదులు బలపడతాయని కందుల రాంబాబు స్పష్టం చేశారు. పార్టీ నాయకత్వం నిర్దేశించిన కార్యాచరణను క్రమబద్ధంగా అమలు చేస్తూ, గ్రామంలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో బూత్ ఇన్‌చార్జిలు 57, మిద్దె నరేష్ ,58, పల్లెటి నరసింహమూర్తి,59 , అత్తిలి చిరంజీవి,60, అత్తిలి వెంకటేశ్వరరావు,61, పిటక సత్తిబాబు,62, డెడ్ల సురేష్ పాల్గొని పార్టీ సంస్థాగత బలోపేతం, రానున్న స్థానిక ఎన్నికలకు సన్నద్ధతకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

## కముజువారిపాలెంలో భవానీల కోలాహలం

నాలుగు వీధుల్లో అమ్మవారి ఊరేగింపు.. భక్తి విన్యాసాలతో ఆకట్టుకున్న మాలధారులు





**కొత్తపేట, పెన్ పవర్,అక్టోబర్ 9:**బిళ్లకుర్రు గ్రామ పరిధిలోని కముజువారిపాలెంలో శ్రీ భవానీ మాలధారులు భక్తిశ్రద్ధలతో సందడి చేశారు. గ్రామానికి చెందిన సుమారు 30 మంది భవానీ మాలధారులు అమ్మవారిని నాలుగు వీధుల్లో ఊరేగిస్తూ భక్తిప్రపత్తులను చాటుకున్నారు. భవానీ మాత, శ్రీ దుర్గామాత మహిమలను వివరిస్తూ భక్తితో చేసిన విన్యాసాలు గ్రామస్థులను ఆకట్టుకున్నాయి. భక్తుల జయజయధ్వానాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భవానీ మాలధారణలోని పవిత్రత, ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని వివరిస్తూ భక్తులు అమ్మవారి నామస్మరణ చేశారు. దుర్గామాత అనుగ్రహం పొందేందుకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడం, నియమనిష్ఠలతో మాలధారణ చేపట్టడం విశిష్టమైన సంప్రదాయమని తెలియజేశారు. భక్తి, క్రమశిక్షణ, ఆత్మనిగ్రహం, దైవచింతన భవానీ దీక్షలో ప్రధానమని వివరించారు. అమ్మవారిని వీధుల్లో ఊరేగిస్తూ భక్తులు ప్రదర్శించిన విన్యాసాలు, భక్తి గీతాలు, నినాదాలు స్థానికులను ఆకట్టుకున్నాయి. చిన్నారులు, మహిళలు, గ్రామస్థులు ఈ కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు. భవానీ మాలధారుల కోలాహలంతో కముజువారిపాలెంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తుల ఆధ్యాత్మిక సందడి గ్రామంలో భక్తిపరవశాన్ని నింపింది.

## కాంట్రాక్టు వైద్య ఉద్యోగుల ధర్నాకు మాల మహానాడు మద్దతు






* కరోనా సమయంలో వారి సేవలు మరువలేనివి
* డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్

**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 9:** తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు వైద్య ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష శుక్రవారానికి ఐదో రోజుకు చేరుకుంది. కాకినాడ ధర్నా చౌక్‌లో కొనసాగుతున్న ఈ దీక్షకు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ మద్దతు ప్రకటించి,నిరసన చేస్తున్న ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రత్నాకర్ మాట్లాడుతూ కరోనా మహమ్మారి సమయంలో కాంట్రాక్టు వైద్య ఉద్యోగులు అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ప్రాణాలకు సైతం తెగించి, ఎన్నో ఆరోగ్యపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటూ బాధితులకు వైద్య సేవలు అందించారని కొనియాడారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు నిరంతరం కృషి చేసిన వారి సేవలను ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. కాంట్రాక్టు వైద్య ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, వారి న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని రత్నాకర్ కోరారు. దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. తమ నిరసన దీక్షకు మద్దతు తెలిపిన డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్‌కు కాంట్రాక్టు వైద్య ఉద్యోగుల జేఏసీ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుతంగా పోరాటాన్ని కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు.










**చదువుతో పాటు సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలి: డాక్టర్ డి. సునీత ప్రిన్సిపాల్**

**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 9**: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాలలో నూతనంగా ప్రవేశించిన ప్రథమ సంవత్సర విద్యార్థులకు స్వాగతం పలుకుతూ నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపింది. కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. సునీత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, కళాశాలలో చేరిన నూతన విద్యార్థులు కళాశాలలో ఉండే ఆధునిక పరికరాలు , విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకుని చదువుతో పాటు సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఫ్రెషర్స్ డే వేడుకలు సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు కళాశాల వాతావరణానికి మరింత ఉత్సాహాన్ని తీసుకువస్తాయని అన్నారు. ఈ రోజు మీరు వినియోగిస్తున్న పరికరాలు మరియు వసతులు పి.యం ఉష లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఏర్పాటు చేసినవని వాటిని జాగ్రత్త గా వినియోగించుకొని భావి తరాలవారికి అందించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా. బి. వీరభద్రరావు డైరెక్టర్ యం వి ఆర్ ఫిజిక్స్ అకాడెమీ కాకినాడ, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడి చదివే తత్వాన్ని అలవరచుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, క్రమశిక్షణతో కూడుకున్న శ్రమ జీవితాలను ఉన్నత శిఖరాలకు చేరుస్తాయని చెప్పడంలో అతిశయోక్తి లేదని అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తన వంతు సహకారంగా కుర్చీలు, సోఫాలు కొనుగోలు చేసేందుకు రూ.50,000 విరాళాన్ని డా. బి. వీరభద్రరావు అందజేశారు. కళాశాల అవసరాల కోసం ఆయన అందించిన ఈ సహకారం పట్ల ప్రిన్సిపాల్ డా. డి. సునీత కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీ కె వేంకటేశ్వర రావు, అధ్యాపకులు డా. ప్రయాగ మూర్తి ప్రగడ , వి రామ రావు , ప్రవీణ్ కుమార్ , ప్రసన్న కుమారి డా. మదీనా, డా. శివ ప్రసాద్, శ్రీ లక్ష్మి, డా. బంగార్రాజు, మేరీ రోజలీనా, పుష్పా, సతీశ్, నాగసత్యవేణి , యేసు, అధ్యాపకేతర సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com